ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వార్తలు
మంగళవారం 13 ఫిబ్రవరి 2024 | 5





నిర్వహణ కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న జేసీ నుపూర్‌అజయ్

'పది' పరీక్షలకు 112 కేంద్రాల ఏర్పాటు

అమలాపురం, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): మార్చి 18 నుంచి 30 వ తేదీ వరకు జరిగే పదో తరగతి పబ్లిక్ పరీక్షలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని కమిటీ సభ్యులకు జాయింట్ కలెక్టర్ ఎస్.నుపూర్‌అజయ్ సూచించారు. పబ్లిక్ పరీక్షల నిర్వహణ కమిటీ సమావేశాన్ని సోమవారం ఆమె అధ్యక్షతన కలెక్టరేట్‌లో నిర్వహించారు. ఉదయం 9.30నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు జరిగే పరీక్షలకు జిల్లావ్యాప్తంగా 112 కేంద్రాలు ఏర్పాటు చేశారు. 10,871 మంది బాలురు, 10,242 మంది బాలికలు పరీక్షలు రాసేందుకు ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. 61 కేంద్రాలు బి, 51 కేంద్రాలు సి కేటగిరీలో వున్నాయని వివరించారు. ప్రశ్నపత్రాల భద్రత కోసం 24 పోలీసుస్టేషన్లు ఏర్పాటు చేశారు. కాన్ఫిడెన్షియల్ మెటీరియల్ స్టోరేజ్ పాయింట్‌గా అమలాపురం జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలను ఎంపిక చేశారు. అమలాపురం బాలుర, బాలికల ఉన్నత పాఠశాలలను స్పాట్‌వాల్యుయేషన్ కేంద్రాలుగా ఎంపిక చేశారు. కపిలేశ్వరపురం మండలంలో ఒక పరీక్షా కేంద్రాన్ని సమస్యాత్మకంగా గుర్తించారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ విధించి, ప్రశ్నావళి, జవాబు పత్రాల రవాణాలో పోలీసులు కీలక బాధ్యతలు వహించాలని సూచించారు. పరీక్షల వేళ జిరాక్సు సెంటర్లను మూసివేయాలన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద కనీస మౌలిక వసతులతో పాటు నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేయాలన్నారు. ప్రత్యేక బస్సులు నడపాలన్నారు. ఇన్విజిలేటర్లు, స్క్వాడ్‌ని విద్యా శాఖ అధికారులు నియమించాలని ఆదేశించారు. ఆరోగ్య పరిరక్షణకు వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలన్నారు. కొన్ని కేంద్రాల్లో సీసీ కెమెరాల నిఘాలో పరీక్షలు నిర్వహించాలన్నారు. ఉత్తీర్ణతా శాతం పెంచేందుకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలన్నారు. జిల్లాను ప్రథమస్థానంలో నిలిపేందుకు కృషి చేయాలన్నారు. సమావేశంలో అడ్మిన్ ఎస్.ఖాదర్‌బాషా, జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వర్లు, విద్యా శాఖ సహాయ సంచాలకుడు ఎం.సురేష్, డీసీఈబీ కార్యదర్శి బి.హనుమంతరావు, డీటీవో అశోక్‌ప్రతాప్‌రావు, కలెక్టరేట్ పరిపాలనాధికారి సీహెచ్ వీరాంజనేయప్రసాద్, అదనపు డీఎంహెచ్‌వో సీహెచ్‌వీ భరతలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



స్పందనలో దివ్యాంగురాలి సమస్య వింటున్న కలెక్టర్ హిమాన్షు శుక్లా

'స్పందన'కు 235 అర్జీలు

అమలాపురం టౌన్, ఫిబ్రవరి 12: కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన 'స్పందన'లో కలెక్టర్ హిమాన్షు శుక్లాతో పాటు జేసీ ఎస్.నుపూర్‌అజయ్, డీఆర్వో సీహెచ్ సత్తిబాబు 235 అర్జీలను స్వీకరించారు. సీపీవో వెంకటేశ్వర్లు, డీపీవో వి.కృష్ణకుమారి, డ్వామా పీడీ ఎస్.మధుసూదన్, జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజరు పీకేపీ ప్రసాద్, డీఎంహెచ్‌వో డాక్టర్ ఎం.దుర్గారావుదొర, ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె.శంకరరావు, నోడల్ అధికారి కె.భీమేశ్వరరావు, డీఆర్డీఏ పీడీ డాక్టర్ వి.శివశంకరప్రసాద్ పాల్గొన్నారు.

రోగాల బారిన పడుతున్నాం

నడిపూడి నక్కావారిపేట కాలనీవాసులు

గతంలో నడిపూడి నుంచి రక్షిత మంచినీరు అందించేవారు. ఆరు నెలలుగా బండారులంక నుంచి తాగునీరు సరఫరా చేస్తున్నారు. మురికి, మలినాలతో కూడిన ఆ నీటిని తాగడం వల్ల రోగాల బారిన పడుతున్నాం. ఆ నీళ్లు కూడా కొంతసేపే ఇస్తున్నారు. తరచూ మరమ్మతులు అంటూ సక్రమంగా సరఫరా చేయ ట్లేదు. ప్రజారోగ్యాన్ని కాపాడాలంటూ కాలనీవాసులు ఎస్.హేమలత, ఎన్వీ లక్ష్మి, నక్కా సత్యనారాయణ, ఎస్.మల్లేశ్వరి తదితరులు అర్జీ అందించారు.

జాబితాలో పేరు ఉంది

కాశి భాగ్య, ముస్లిం వీధి, అమలాపురం

మూడున్నరేళ్ల క్రితం నాకు వన్నె చింతలపూడిలో ఇళ్ల స్థల పట్టా ఇచ్చారు. పట్టాలో కొద్దిపాటి లోపాలను సరిచేయాలని అప్పట్లో వలంటీరు పత్రం తీసుకుంది. అప్పటి నుంచి ఆ పట్టా పత్రం కోసం సచివాలయం చుట్టూ తిరుగుతూనే ఉన్నా. ఇప్పుడు ఆ పట్టాలకు రిజిస్ట్రేషన్ చేయాలని నా వద్దనున్న జిరాక్సును తీసుకుని వెళ్లినా ఒరిజినల్ పట్టా కావాలంటున్నారు. జాబితాలో పేరు ఉన్నప్పటికీ రిజిస్ట్రేషన్ చేయట్లేదు.



పి.గన్నవరంలో తహసీల్దారు హుస్సేన్‌కు ఇళ్ల స్థల పట్టా చూపిస్తున్న లబ్ధిదారుడు

"రాష్ట్రంలో ప్రతి నిరుపేదకు సొంత గూడు కల్పించడమే లక్ష్యమంటూ ప్రకటనలు గుప్పించి హంగు, హంగామా చేసింది వైసీపీ ప్రభుత్వం. కానీ క్షేత్రస్థాయిలో పలు గ్రామాల్లో నిరుపయోగమైన స్థలాలను గుర్తించారు. ఒక ఊరివారికి వేరే ఊర్లో ఇళ్ల స్థలాలు కేటాయించి నిరుపేదలకు ఇళ్ల స్థలాల కేటాయింపులో పూర్తిగా విఫలమైంది. ఇప్పటికీ పలుచోట్ల జగనన్న లే-అవుట్లు పూర్తిస్థాయిలో సిద్ధం కాకపోగా మరికొన్నిచోట్ల మౌలిక సదుపాయాలు లేక అస్తవ్యస్తంగా వున్నాయి. ఇదంతా ఒక ఎత్తయితే పి.గన్నవరం మండలంలో పలువురు లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు ఇచ్చారు కానీ.. నేటికీ కనీసం స్థలం చూపించని పరిస్థితి నెలకొంది."

జగనన్నా... స్థలమెక్కడ!

- పట్టాలిచ్చారు... కానీ హద్దులు లేవు
- స్థలం కొరతతో పట్టాలకే పరిమితమైన పలువురు లబ్ధిదారులు
- మూడేళ్లు పూర్తయినా అందని ఇళ్లు

పి.గన్నవరం, ఫిబ్రవరి 12: పి.గన్నవరం మండలంలో సుమారు 2,175 ఇళ్ల స్థలాలకు పట్టాలను రిజిస్ట్రేషన్ చేసే పనిలో సంబంధిత సిబ్బంది నిమగ్నమయ్యారు. 90 రోజుల్లో ఇళ్ల పట్టాలు మంజూరు చేసే కార్యక్రమంలో భాగంగా పలువురు లబ్ధిదారులు స్థలాల కోసం దరఖాస్తు చేసుకున్నారు. ప్రభుత్వ ఆదేశాలమేరకు వారిలో అర్హులను గుర్తించి పట్టాలు మంజూరు చేశారు. కానీ స్థలాల కొరతతో లే-అవుట్‌లో స్థలం చూపించలేకపోయారు. దీంతో రిజిస్ట్రేషన్ల కోసం సచివాలయాలు, అధికారుల చుట్టూ లబ్ధిదారులు చక్కర్లు కొడుతున్నారు. వారికి ఇచ్చిన పట్టాలో పేరు, అడ్రసు, ఆధార్ నెంబరు, పట్టా నెంబరు మాత్రమే ఉన్నాయి. స్థలం ఎక్కడ కేటాయించారో, హద్దులు ఏవో ప్రస్తావించకుండా పట్టాలు పంపిణీ చేశారు. పి.గన్నవరం గ్రామానికి చెందిన ఓ లబ్ధిదారుడు తనకు ఇచ్చిన పట్టాతో రిజిస్ట్రేషన్ కోసం సచివాలయానికి వెళ్లాడు. అయినా ఫలితం లేకపోవడంతో సోమవారం 'స్పందన'లో తహసీల్దారుకు తన సమస్యను వివరించాడు. స్థలం కొను గోలు చేసిన తర్వాత హద్దులు చూపిస్తామని చెప్పారు. ఈ సమస్యపై రెవెన్యూ అధికారులను వివరణ కోరగా... 90 రోజుల్లో ఇళ్ల స్థలాల మంజూరుకు పలువురు దరఖాస్తు చేసుకున్నారు. వారితో పాటు మిగిలిన లబ్ధిదారులకు మండల వ్యాప్తంగా సుమారు ఐదు ఎకరాలు అవసరమన్న విషయాన్ని ఉన్నతాధికారులకు నివేదించామని తెలిపారు.



పి.గన్నవరం గ్రామానికి చెందిన ఓ లబ్ధిదారుడికి కేటాయించిన పట్టాలో హద్దులు సూచించకుండా ఖాళీగా ఉన్న దృశ్యం

ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్లలో ఎన్ని లీలలో...

అమలాపురం రూరల్, ఫిబ్రవరి 12: జగనన్న కాలనీల్లో ఇళ్ల స్థల పట్టాల రిజిస్ట్రేషన్లలో ఎన్నో లీలలు... పట్టాలకు రిజిస్ట్రేషన్లు చేస్తున్నారు సరే... మా స్థలమెక్కడ సారూ అని లబ్ధిదారులు ప్రశ్నిస్తుంటే సంబంధిత అధికారులు తలలు పట్టుకుంటున్నారు. అమలాపురం పట్టణ, పరిసర గ్రామాల ప్రజలకు మండల పరిధిలోని తాండవపల్లి, వన్నెచింతలపూడి గ్రామాల్లో సుమారు 42 ఎకరాల భూమిని కొనుగోలు చేసారు. మూడున్నరేళ్లు గడిచిపోయినా ఇంతవరకు పట్టా భూముల మెరక పనులు పూర్తి చేయలేదు. మండలంలో సుమారు 40 నుంచి 50 ఎకరాలకు పైగానే భూములను మెరక చేయాల్సి ఉంది. అవి పూర్తయితేనే గానీ లే-అవుట్లు వేయలేరు. మార్కింగ్ చేయలేని పరిస్థితి. అయినా లబ్ధిదారులకు ఇచ్చిన ఇళ్ల స్థల పట్టాల రిజిస్ట్రేషన్లు మాత్రం శరవేగంగా జరిగిపోతున్నాయి. పలు గ్రామాల్లో వింత పరిస్థితులు నెలకొన్నాయి.



తాండవపల్లిలో నేటికీ మెరక చేయని ఇళ్ల స్థల పట్టా భూములు

గూడాలలో ఇళ్ల స్థల పట్టాలు ఇచ్చారు..

నడిపూడి గ్రామానికి చెందిన నిరుపేద లబ్ధిదారులకు అల్లవరం మండలం గూడాలలో ఇళ్ల స్థల పట్టాలు ఇచ్చారు. వాటికి రిజిస్ట్రేషన్లను నడిపూడి సచివాలయంలో ప్రారంభించారు. వారికి ఇచ్చిన పట్టాలతో సంబంధం లేకుండా నడిపూడిలోనే వారికి ఇళ్ల స్థల పట్టాలు ఇచ్చినట్టు రిజిస్టర్ అయి డాక్యుమెంట్లు బయటకు వస్తుండడంతో వెంటనే అధికారులు గుర్తించి రిజిస్ట్రేషన్లను నిలుపుదల చేశారు. ఈ విషయాన్ని జాయింట్ కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లారు. అమరావతిలోని సీసీఎల్ఏలో మ్యాపింగ్ తిరిగి చేస్తేనే గానీ నడిపూడి లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్లు చేసే పరిస్థితి లేకుండా పోయింది.

స్థలాలు చూపించకుండా రిజిస్ట్రేషన్లా!

మండల పరిధిలోని బండారులంక, తాండవపల్లి, వన్నెచింతలపూడి గ్రామాల్లో ఇళ్ల స్థలాల కోసం కొనుగోలు చేసిన భూములను ఇంత వరకు మెరక చేయలేదు. ఎప్పుడో ఇచ్చిన ఇళ్ల స్థల పట్టాలకు ఇప్పుడు రిజిస్ట్రేషను అంటున్నారు. సరే మాకిచ్చిన స్థలం ఎక్కడో చూపించాలని లబ్ధిదారులు అధికారులను వేడుకుంటున్నారు. కామనగరువుకు చెందిన 200 మంది లబ్ధిదారులకు వన్నెచింతలపూడిలో పట్టాలు ఇచ్చారు. వారికి ఇచ్చిన స్థలం ఎక్కడో ఇంత వరకు చూపించలేదు. ఎన్నో ఆందోళనలు చేసినా బండారులంకలో లబ్ధిదారులకు ఇళ్లస్థలం ఎక్కడ ఉందో తెలియని పరిస్థితి. ఇలా ఎన్నో గ్రామాల ప్రజలు తమకిచ్చిన స్థలాన్ని చూపించండని వేడుకుంటున్నారు.

పట్టాలున్నాయి.. రిజిస్ట్రేషన్లు లేవు..

జనుపల్లిలోనే ఇళ్లస్థలాలు ఇచ్చినట్టు మూడున్నరేళ్ల క్రితం పట్టాలు ఇచ్చారు. ఇప్పుడు రిజిస్ట్రేషన్ చేయ ట్లేదు. ఇదేమిటని అధికారులను ప్రశ్నిస్తుంటే ఎవరూ పట్టించుకోవట్లేదు. తమకిచ్చిన ఇళ్ల స్థల పట్టాల భూములను చూపించి రిజిస్ట్రేషన్ చేయాలని గ్రామానికి చెందిన అధికారి సత్యవేణి, దుంగా కుమారి, వాసంశెట్టి వెంకటపద్మావతి, కైరం అమ్మాజీ, మేడిచర్ల జానకీ తదితరులు సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన స్పందనలో అర్జీ అందించారు.





పట్టాలు ఉన్నాయి.. ఆన్‌లైన్‌లో పేర్లు లేవు..

అల్లవరం మండలం దేవగుప్తం గ్రామానికి చెందిన లబ్ధిదారులకు 2020లో ఇళ్ల స్థల పట్టాలు ఇచ్చారు. రిజిస్ట్రేషన్ చేస్తున్నారని సచివాలయానికి వెళ్తే ఆన్‌లైన్‌లో పేర్లు లేవని అధికారులు చెప్తున్నారు. పట్టాలు మా దగ్గరే ఉన్నాయి. కొత్తగా దరఖాస్తు చేసుకున్న వారికి ఇచ్చిన పట్టా స్థలాల వివరాలు ఆన్‌లైన్‌లో కనిపిస్తున్నాయి. ఎన్నో ఏళ్లుగా అద్దె ఇళ్లల్లో బతుకుతున్నాం. ఇళ్ల స్థలాలు ఇచ్చి ఆదుకుని తమ పేరున రిజిస్ట్రేషన్ చేయించాలని జె.అనుపమ, సీహెచ్ వరలక్ష్మి, యలమంచిలి పార్వతి, వై.గంగాభవానీ పూజ తదితరులు కలెక్టర్‌కు అర్జీ అందించారు.



బాధ్యతలు స్వీకరిస్తున్న వెంకటేశ్వర్లు

జిల్లా రెవెన్యూ అధికారిగా వెంకటేశ్వర్లు



వీరాంజనేయప్రసాద్
కలెక్టరేట్ పరిపాలనాధికారి

అమలాపురం, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో చేపట్టిన బదిలీల్లో భాగంగా జిల్లా రెవెన్యూ అధికారిగా మొగిలి వెంకటేశ్వర్లు సోమవారం కలెక్టరేట్‌లో బాధ్యతలు స్వీకరించారు. కృష్ణా జిల్లా మచిలీపట్నం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ వైస్ చైర్మన్ వెంకటేశ్వర్లు బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇప్పటి వరకు డీఆర్వోగా పనిచేసిన సీహెచ్ సత్తిబాబును బాపట్ల జిల్లా డీఆర్వోగా బదిలీ చేశారు. కృష్ణా జిల్లా మొవ్వ తహసీల్దారు సీహెచ్ వీరాంజనేయప్రసాద్‌ను కలెక్టరేట్ పరిపాలనాధికారిగా నియమించగా బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన కె.కాశీవిశ్వేశ్వరరావును ఏలూరు జిల్లా కలెక్టరేట్ పరిపాలనాధికారిగా బదిలీ చేశారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన అధికారులను కలెక్టరేట్ సిబ్బంది, సెక్షన్ల సూపరింటెండెంట్లు అభినందించారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న జోగేశ్వరరావు

ఎమ్మెల్సీ తోట చాలెంజ్‌ని స్వీకరిస్తున్నా

కేశవరంలో పోటీకి సిద్ధం: ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు

మండపేట, ఫిబ్రవరి 12: ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు ఈ నెల 9న తనకు చేసిన చాలెంజ్‌ను స్వీకరిస్తున్నట్టు ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు వెల్లడించారు. పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కేశవరంలో పోటీకి సిద్ధమని చెప్పారు. నియోజకవర్గంలో 42 గ్రామాలు, మండపేటలో 30వార్డుల ప్రజల అవసరం తోటకు లేదా అని వేగుళ్ల ప్రశ్నించారు. కేశ వరంలో తోట ఓడిపోతే ఎన్నికల్లో పోటీ చేయనని సీఎం జగన్‌తో ప్రకటన చేయిస్తే తాను కూడా తమ పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడుతో ప్రకటన చేయిస్తానని వేగుళ్ల చెప్పారు. ఎమ్మెల్సీ తోటపై కేశవరం ప్రజలు ఆగ్రహంతో ఉన్నారన్నారు. తోట తీరుకు భయపడి ఎవరూ బయటకు రావట్లేదన్నారు. ఆయన కేశవరంలో గ్రావెల్ దోచుకున్నాడని ప్రజలే బాహాటంగా చెప్తున్నారన్నారు. గ్రామంలో నిర్వహించే ప్రైవేటు ఎన్నికల అనంతరం తోట అసలు బండారం బయటపడుతుందని వేగుళ్ల అన్నారు. ఎన్నికల తర్వాత ఏమిటనే దానిపై తోట స్పష్టత ఇవ్వాలన్నారు. నియోజకవర్గంలో విద్యుత్ పనులకు రూ.5కోట్లు విడుదలయ్యాయని తోట చెప్పారని, దానికి సంబంధించిన విడుదల ఉత్తర్వులను వెల్లడించాలని వేగుళ్ల డిమాండ్ చేశారు. తోట ఆటలు రామచంద్రపురంలో తప్ప మండపే టలో సాగవన్నారు. టిడ్కో గృహాల విషయంలో బహిరంగ చర్చకు సిద్ధమని చెప్పిన తోట... తర్వాత తన ఇంటికి పోలీసులను పంపి అడ్డుకున్నారన్నారు. తోట చేసిన చాలెంజ్‌కు తాను సిద్ధమని ఆయన అందుకు సిద్ధమా? లేదో వెల్లడించాలని వేగుళ్ల డిమాండ్ చేశారు. సమావేశంలో టీడీపీ నేతలు వాదా ప్రసాదరావు, టీడీపీ పట్టణ శాఖ అధ్యక్షుడు యు.రాంబాబు, జె.సూర్యారావు, గడి రాంబాబు, మల్లిపూడి గణేష్, గుండు తాతరాజు, చింతలపూడి సత్తిబాబు, గనిశెట్టి బాబీ, వల్లూరి ఇందిరారాణి, కాళ్లకూరి శ్రీను, కొవ్వాడ అప్పన్నబాబు తదితరులు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాల విద్యార్థులు 52 మందికి అస్వస్థత

రామచంద్రపురం మండలం ఆదివారపుపేటలో ఘటన

...వివరాలు 7లో

ఉత్తీర్ణతా శాతం పెంచేందుకు కృషి చేయాలి

జిల్లా విద్యాశాఖాధికారిణి కమలకుమారి

ముమ్మిడివరం, ఫిబ్రవరి 12: పదో తరగతి విద్యార్థుల ఉత్తీర్ణతా శాతం పెంచేందుకు రూపొందించిన ఆడియో క్లిపింగ్‌లను ప్రతిరోజూ వారికి వినిపించడం ద్వారా ఎక్కువ మార్కులు సాధించేందుకు వీలు కలుగుతుందని జిల్లా విద్యాశాఖాధికారిణి ఎం.కమలకుమారి పేర్కొన్నారు. ఆడియో క్లిపింగ్ సంపుటిని సోమవారం ఆమె ప్రారంభించి జిల్లాలోని అన్ని పాఠశాలలకు పంపించారు. డిస్ట్రిక్ట్ కామన్ ఎగ్జామినేషన్ బోర్డు (డీసీఈబీ) కార్యదర్శి బి.హనుమంతరావు మాట్లాడుతూ పదో తరగతి విద్యార్థుల ఉత్తీర్ణతా శాతం పెంచేందుకు నెల రోజులుగా అన్ని సబ్జెక్టులకూ రివిజన్ టెస్టులు నిర్వహిస్తున్నామన్నారు. ప్రతి సబ్జెక్టులోనూ ఒక మార్కు ప్రశ్నలను నిపుణులైన సబ్జెక్టు టీచర్లతో ఆడియో రికార్డింగు చేయించి ఐఎఫ్‌సీ ప్యానల్ ద్వారా రోజూ విద్యార్థులకు వినిపిస్తామన్నారు. ఆడియో క్లిపింగ్‌లను తెలుగులో ప్రభావతి, ఇంగ్లిషులో జగపతి, వెంకటేశ్వరరావు, హిందీలో బాషా, గణితంలో అవధాని, పీఎస్‌లో నరసింహారావు, జీఎస్‌లో ఆర్.భాస్కరరావు, సోషియాలజీలో కృష్ణారెడ్డి రూపొందించారన్నారు. వారిని డీసీఈబీ కార్యదర్శి హనుమంతరావు అభినందించారు.



ఆడియో క్లిపింగ్ సంపుటిని ఆవిష్కరిస్తున్న డీఈవో కమలకుమారి

టిడ్కో ఇళ్లు వారంలో ఇవ్వాలి... లేకుంటే తాళాలు బద్దలుకొట్టి ప్రవేశిస్తాం

- అధికారులకు లబ్ధిదారుల హెచ్చరిక
- ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావుతో కలిసి మున్సిపల్ కార్యాలయం ఎదుట బైఠాయింపు

మండపేట, ఫిబ్రవరి 12: టీడీపీ హయాంలో పట్టణంలోని గొల్లపుంత కాలనీలో నిర్మించిన టిడ్కో గృహాలను తక్షణం అందించాలని, బ్యాంకు రుణ వాయిదాలు చెల్లించాలని ఇచ్చిన నోటీసులను వెనక్కి తీసుకోవాలని కోరుతూ లబ్ధిదారులు సోమవారం ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావుతో కలిసి మండపేట మున్సిపల్ కార్యాలయం వద్ద బైఠాయించారు. తొలుత వారు కమిషనరు చాంబర్లోకి వెళ్లి కమిషనరును కలిసి తమ సమస్యలను వివరించారు. తమ వద్ద నుంచి ఇంటికి లక్ష రూపాయలు వంతున కట్టించుకున్నారని, ఇప్పటివరకు గృహాలు ఇవ్వలేదని కమిషనర్ ముందు తమ గోడు వెళ్లబోసుకున్నారు. తమకు ఇంటిని అప్పగించకుండానే బ్యాంకు రుణం ఇచ్చి వేలకు వేలు వాయిదాలు చెల్లించమంటూ బ్యాంకుల నుంచి నోటీసులు వస్తున్నాయన్నారు. వాయిదాలు చెల్లించకుంటే ఊరుకునేది లేదని సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు తమను బెదిరిస్తున్నారని వాపోయారు. వారంలోగా ఇళ్లు అప్పగించకుంటే తాళాలు బద్దలుకొట్టి ఇళ్లల్లోకి ప్రవేశిస్తామని లబ్ధిదారులు ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

ఎమ్మెల్యే వేగుళ్ల మాట్లాడుతూ ఫేజ్-1లో ఇంకా ఎంత మందికి ఇళ్లు ఇవ్వాలని ప్రశ్నించారు. 4,064 ఇళ్లకు గాను 2,780 ప్రారంభించి 2,100 మందికి అప్పగించామని, మరో 600 మందికి ఇవ్వాల్సి ఉందని అధికారులు చెప్పారు. వారేం పాపం చేశారని, ఇళ్లు ఇవ్వడంలో ఎందుకు జాప్యం చేస్తున్నారని అధికారులను నిలదీశారు. టిడ్కో గృహాలను మున్సిపాలిటీ ఎందుకు ఇవ్వట్లేదన్నారు. టిడ్కో ఇళ్లకు రంగు లు మార్చడంపై వున్న శ్రద్ధ లబ్ధిదారులకు వాటిని ఇవ్వడంలో ప్రభుత్వానికి ఎందుకు లేదన్నారు. అనంతరం లబ్ధిదారులు బయటకు వచ్చి ఎమ్మెల్యే వేగుళ్లతో కలిసి మున్సిపల్ గేటు ఎదుట బైఠాయించారు. టిడ్కో గృహాలను ఎప్పుడు ఇస్తారో వెల్లడించాలని నినాదాలు చేశారు. కమిషనరు రాము బయటికొచ్చి వారంలో ఇళ్లు అందిస్తామని ప్రకటించడంతో లబ్ధిదారులు శాంతించారు. మున్సిపల్ కౌన్సిలర్ యారమాటి గంగరాజు, కాశిన కాశీవిశ్వనాథం, వాదా ప్రసాదరావు, కొవ్వాడ అప్పన్నబాబు, గడి రాంబాబు, దూళి జయరాజు, టీడీపీ పట్టణ శాఖ అధ్యక్షుడు ఉంగరాల రాంబాబు, మాజీ కౌన్సిలర్లు మందపల్లి దొరబాబు, బండి గోవిందు, అంజానీ, బొడ్డు రామకృష్ణ, కాళ్లకూరి శ్రీను, గుండు తాతంరాజు, జొన్నపల్లి సూర్యారావు, పాలచర్ల శిరీష, చాపల వీరబాబు తదితరులు పాల్గొన్నారు.



కమిషనర్ చాంబర్‌ను ముట్టడించిన లబ్ధిదారులు



మున్సిపల్ కార్యాలయం గేటు ఎదుట టిడ్కో లబ్ధిదారులతో కలిసి బైఠాయించిన ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు



కల్యాణోత్సవానికి రాట ముహూర్తం నిర్వహిస్తున్న అర్చకులు

భీమేశ్వరస్వామివారి కల్యాణ ఏర్పాట్లకు రాట ముహూర్తం

ద్రాక్షారామ, ఫిబ్రవరి 12: బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురం మండలం ద్రాక్షారామ భీమేశ్వరస్వామివారి కల్యాణ మహోత్సవ ఏర్పాట్లకు సోమవారం శాస్త్రోక్తంగా రాట ముహూర్తం జరిపారు. మాణిక్యాంబ సమేత భీమేశ్వరస్వామివార్ల కల్యాణ మహోత్సవం ఈనెల 20 నుంచి 26 వరకు జరుగనున్నాయి. దక్షిణ గోపురం వద్ద సోమవారం ఉదయం 8.39 గంటలకు అర్చకులు, వేదపండితులు, స్వస్తివాచకులు, హోమందార్లు వేదమంత్రాలతో ఈవో పీటీవీ సత్యనారాయణ చేతుల మీదుగా రాటముహూర్తం చేశారు. ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు సప్త నదీ జలాభిషేకం

అయినవిల్లి, ఫిబ్రవరి 12: అయినవిల్లి శ్రీసిద్ధివినాయక ఆలయంలో వార్షికంగా నిర్వహించే సప్తనదీ జలాభిషేకం, లక్ష కలముల వితరణ మంగళవారం నుంచి గురువారం వరకు జరుగుతాయని ఆలయ ఈవో ముదునూరి సత్యనారాయణరాజు సోమవారం తెలిపారు. మంగళవారం ఉదయం 9.45 గంటలకు గణపతి పూజ, దీక్షా ప్రారంభం, పుణ్యాహవచనం, పంచగవ్యం, గణపతికల్పము, సప్తనదీజల మండపారాధన, మహాన్యాసం, సప్తనదీ జలాభిషేకాలు, అభిషేకాలు, లక్ష దుర్వార్చన, లక్ష్మీగణపతి అష్ట ద్రవ్య హోమం, నీరాజన మంత్రపుష్పం జరుగుతాయి. బుధవారం గణపతి పూజ, సరస్వతీ కల్పము, సరస్వతీ మండపారాధన, సరస్వతీ మండపారాధన, సరస్వతీ హోమం, కలాలను స్వామివారి పాదాల చెంత ఉంచి పూజలు నిర్వహిస్తారు. గురువారం పూజలనంతరం ఈ పెన్నులను పంపిణీ చేస్తారు.



స్వామివారి హుండీ ఆదాయం లెక్కిస్తున్న సిబ్బంది

స్వామివారి హుండీ ఆదాయం రూ.24,41,574

అంతర్వేది, ఫిబ్రవరి 12: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా సఖినేటిపల్లి మండలం అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి ఆలయంలో సోమవారం హుండీలను తెరిచి కానుకలను లెక్కించారు. ప్రధాన హుండీ ఆదాయం రూ.23,77,401 రాగా అన్నదాన హుండీ నుంచి రూ.64,173 వచ్చింది. మొత్తం 38 రోజులకు రూ.24,41,574 వచ్చిందని ఆలయ సహాయ కమిషనర్ వి. సత్యనారాయణ తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా దేవదాయ శాఖ అధికారి డి.నాగమల్లేశ్వరరావు, ఈవో బి.వెంకటేశ్వరరావు, ఎంపీటీసీ భైరా నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



సర్పంచ్, ఎంపీటీసీలకు వినతిపత్రం అందిస్తున్న సభ్యులు

యూపీ స్కూల్‌ను హైస్కూల్‌గా అప్‌గ్రేడ్ చేయండి

రంగంపేట,ఫిబ్రవరి, 12 రంగంపేట మండలం కోటపాడు గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలను 2024- 25 విద్యా సంవత్సరానికి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలగా అప్‌గ్రేడ్ చేయాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు. లేకుంటే తమ పిల్లలను ఏ స్కూల్‌కి పంపించకుండా చదువు మానిపించేస్తామని విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్తులు సర్పంచ్ గవరసాని లక్ష్మికి, ఎంపీటీసీ సభ్యుడు సుంకర అప్పారావులకు సోమవారం వినతిపత్రం అందించారు. దీంతో వారు ఈ విషయం ప్రజాప్రతినిధులకు, ఉన్నతాధికారులకు తెలియపరుస్తామని పేరెంట్స్ కమిటీ సభ్యులకు తెలిపారు.

కసాయి తండ్రి!

- పిల్లలపై పెట్రోల్ పోసి నిప్పంటించిన తండ్రి
- భార్యపై కోపమే కారణం
- భార్య ఫిర్యాదుతో భర్తపై హత్యాయత్నం కేసు
- ఇద్దరు చిన్నారుల పరిస్థితి ఆందోళనకరం

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): భార్యభర్తల మధ్య గొడవలు పిల్లల ప్రాణాల మీదకు తెచ్చాయి. భార్యతో విభే దాల కారణంగా కన్నపిల్లలపై దాష్టీకానికి పాల్పడిన తండ్రిపై హత్య కేసు నమోదు చేశారు. బొమ్మూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం రూరల్ శాటిలైట్ సిటీకి చెందిన గూడి సాయి కిరణ్‌కి ఎర్రవరానికి చెందిన దుర్గతో ఆరేళ్ల కిందట వివాహమైంది. ఆటో డ్రైవర్‌గా కుటుంబాన్ని పోషించుకునేవాడు. కొంతకాలంగా ఇద్దరూ గొడవలు పడుతున్నారు. ఈ నేపథ్యంలో నాలుగేళ్ల కొడుకు సందీప్, ఏడాదిన్నర కూతురితో ఆమె అమ్మగారింటికి వెళ్లిపోయింది. గత నెల 21వ తేదీన అత్తగా రింటికి వెళ్లిన సాయి గొడవపడి ఇద్దరు పిల్లలను తీసుకొని వచ్చేశాడు. ఏమైందో ఏమోగానీ ఆదివారం అతడి ఇంట్లో నుంచి పొగ రావడం గమనించిన స్థానికులు వెళ్లి చూశారు. ఆ ఇంట్లో అప్పటికే అతడు, పిల్లలు తీవ్రంగా కాలిన గాయాలతోపడి ఉండడం చూసి భయాందోళన చెందారు. వెంటనే రాజమహేంద్రవరం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. గ్యాస్ లీకై మంటలు అంటుకున్నాయని సాయి చెప్పాడు. వైద్యుల సూచనలతో మెరుగైన వైద్యానికి కాకినాడ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. హైదరాబాద్‌లో బంధువుల ఇంటి వద్ద ఉన్న పిల్లల తల్లి అక్కడి నుంచి నేరుగా కాకినాడ ఆస్పత్రికి చేరుకుంది. తనపై కోపంతో పిల్లలపై భర్త సాయి పెట్రోలు పోసి నిప్పంటించాడని సోమవారం బొమ్మూరు పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు హత్యాయత్నం కేసు నమోదు చేశామని సీఐ ఉమర్ తెలిపారు. పిల్లల ఇద్దరు 80 శాతం మేర కాలిపోవడంతో ఆరోగ్య పరిస్థితి ఆందోళనకరంగానే ఉందని బంధువులు చెప్పారు. చిన్నారులు ఇద్దరూ ప్రస్తుతం కాకినాడ జీజీహెచ్‌లో ప్రాణాలతో కొట్టుమిట్టాడుతున్నారు. తండ్రి గాయాలపాలై చికిత్స పొందుతున్నాడు.





విద్యార్థుల నుంచి వివరాలు తెలుసుకుంటున్న డీఎంఅండ్‌హెచ్‌వో, ఇతర అధికారులు.. విద్యార్థులను పరామర్శిస్తున్న టీడీపీ ఇన్‌చార్జి రెడ్డి సుబ్రహ్మణ్యం

52 మంది గురుకుల పాఠశాల విద్యార్థులకు అస్వస్థత

- 8 మందికి ఏరియా ఆసుపత్రిలో చికిత్స
- కలుషిత ఆహారమే కారణమంటున్న వైద్యులు
- పలువురు ప్రముఖుల పరామర్శ

ద్రాక్షారామ, ఫిబ్రవరి 12: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురం మండలం ఆదివారపుపేటలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాల విద్యార్థులు 52 మంది సోమవారం అస్వస్థతకు గురయ్యారు. అందులో 8 మందిని రామచంద్రపురం ఏరియా ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. కలుషిత ఆహారం తినడం కారణంగా విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారని ప్రాథమికంగా నిర్ధారించారు. ఈ గురుకుల పాఠశాలలో 450 మంది వరకు విద్యార్థులు ఉన్నారు. వారిలో కొంతమందికి ఆదివారం రాత్రి వాంతులు, రక్త విరోచనాలు అయ్యాయి. గురుకుల పాఠశాల ఆరోగ్య పర్యవేక్షకుడు విద్యార్థులకు ప్రాథమిక వైద్యం అందించాడు. సోమవారం ఉదయం నాటికి అస్వస్థతకు గురైన వారి సంఖ్య 52కు చేరుకుంది. అందులో కొంత మందికి వాంతులతోపాటు రక్త విరోచనాలు అయ్యాయి. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ దుర్గారావుదొర పాఠశాలను సందర్శించి విద్యార్థులకు వైద్య అందుతున్న తీరును పరిశీలించారు.

పీహెచ్‌సీ వైద్య శిబిరం

పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ ప్రశాంతి, డాక్టర్ సందీప్ నాయుడు, డాక్టర్ అలేఖ్య, డాక్టర్ మణికంఠలు గురుకుల పాఠశాలలో వైద్య శిబిరం ఏర్పాటుచేశారు. విద్యార్థులను పరీక్షించారు. ప్రాథమిక చికిత్స అందించారు. వాంతులు, రక్త విరోచనాలవుతున్న ఐదుగురితోపాటు మరో 8 మందిని అంబులెన్సులో రామచంద్రపురం ఏరియా ఆసుపత్రికి తరలించారు. రామచంద్రపురం ఏరియా ఆసుపత్రిలో పర్యవేక్షకుడు డాక్టర్ వీరభద్రుడు, పిల్లల వైద్యులు విద్యార్థులకు చికిత్స అందచేశారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ దుర్గారావుదొర, సాంఘిక సంక్షేమ శాఖ జిల్లా కోఆర్డినేటర్ సంజీవరావు, సంయుక్త కార్యదర్శి, ఇతర అధికారులు ఆసుపత్రిలో విద్యార్థులకు అందుతున్న చికిత్సను పరిశీలించారు. అందించిన చికిత్స వివరాలను వైద్యులు, సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. చికిత్స పొందుతున్న విద్యార్థులతో మాట్లాడి తీసుకున్న ఆహారం, అస్వస్థత ఎలా గురయ్యారని అడిగి తెలుసుకున్నారు. అలాగే టీడీపీ రామచంద్రపురం నియోజకవర్గం ఇన్‌చార్జి రెడ్డి సుబ్రహ్మణ్యం, జనసేన నియోజకవర్గం ఇన్‌చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్, వైసీపీ నియోజకవర్గం ఇన్‌చార్జి పిల్లి సూర్యప్రకాష్, మున్సిపల్ చైర్మన్ గాదంశెట్టి శ్రీదేవి, ఎంపీపీ అంబటి భవానీ ఏరియా ఆసుపత్రిలో విద్యార్థులను పరామర్శించారు. చికిత్స వివరాలు అడిగారు.

కలుషిత ఆహారమే కారణం

విద్యార్థులకు ఫుడ్‌పాయిజన్ కావడం వల్లే అస్వస్థతకు గురయ్యారని డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ దుర్గారావుదొర తెలిపారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థుల ఆరోగ్యం స్థిరంగా ఉందని, మంగళవారం ఉదయం డిశ్చార్జి చేయవచ్చని తెలిపారు. రెండో శనివారం పేరెంట్స్‌డే కావడంతో విద్యార్థులు తమ తల్లిదండ్రులు తీసుకువచ్చిన మాంసాహారం భుజించారు. ఆదివారం ఉదయం అల్పాహారంగా పూరి, మధ్యాహ్నం చికెన్ బిర్యానీ ఆహారంగా తీసుకున్నారు. ఆహారం కలుషితం కావడంతో విద్యార్థులు అస్వస్థతకు గురైనట్టు తేల్చారు.

కమిటీ వేసి నిర్ధారించాలి..

రామచంద్రపురం, ఫిబ్రవరి 12: ఈ సందర్భంగా రెడ్డి సుబ్రహ్మణ్యం విలేకరులతో మాట్లాడుతూ అదృష్ట వశాత్తు విద్యార్థులు క్షేమంగా ఉన్నారని, ఘటనకు కారణమేమిటో కమిటీ వేసి నిర్ధారించాలని, బాధ్యుడైన హాస్టల్ వార్డెన్‌ను తక్షణం సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్ చంద్రబోస్ విద్యార్థులను పరామర్శించారు. జనసేన, టీడీపీ, వైసీపీలకు చెందిన నాయకులు పాల్గొన్నారు.





బకెట్‌తో ఓఆర్ఎస్ అందిస్తున్న దృశ్యం.. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులు



డీఎస్సీ నోటిఫికేషన్ ప్రతులను దహనం చేస్తున్న నేతలు

డీఎస్సీ నోటిఫికేషన్ ప్రతుల దహనం

అమలాపురంటౌన్, ఫిబ్రవరి12: రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన ఉపాధ్యాయ నియామక ప్రక్రియలో అప్రంటిస్ విధానాన్ని ప్రవేశపెట్టడంపై యూటీఎఫ్ ఆధ్వర్యంలో సోమవారం అమలాపురం హైస్కూలు సెంటర్లో నిరసన తెలిపారు. డీఎస్సీ నోటిఫికేషన్ నమూనా ప్రతులను దహనం చేశారు. అప్రంటీస్ విధానాన్ని రద్దుచేస్తూ కొత్త నోటిఫికేషన్ విడుదల చేయాలని యూటీఎఫ్ జిల్లా శాఖ అధ్యక్షుడు పెంకే వెంకటేశ్వరరావు డిమాండు చేశారు. జిల్లా కార్యదర్శులు పి.మురుగేశ్వరరావు, పెన్నాడ శ్రీనివాసరావు, కె.శ్రీనివాసరావు, బీఎస్ వెంకటేశ్వరరావు, సత్తార్, రేణుకాప్రసాద్, తోరం బాలాజీ, ఈశ్వరరావు, సత్యనారాయణ, గణేష్‌కుమార్ పాల్గొన్నారు.





చేబ్రోలులో చోరీకి ప్రయత్నించిన దృశ్యం.. చోరీకి పాల్పడిన వ్యక్తిని పట్టుకున్న పోలీసులు

పట్టపగలు చోరీకి ప్రయత్నం.. దొంగకు దేహశుద్ధి

గొల్లప్రోలు రూరల్, ఫిబ్రవరి 12: కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం చేబ్రోలులో పట్టపగలు చోరీకి ప్రయత్నించిన వ్యక్తిని స్థానికులు పట్టుకున్నారు. ఆ వ్యక్తి తిరగబడటానికి ప్రయత్నించడంతో దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. గ్రామంలోని ఈబీసీ కాలనీ వద్ద గల మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల వద్ద నివాసముంటున్న బొమ్మిడాల కామేశ్వరరావు తన ఇంటికి తాళం వేసుకుని బయటకు వెళ్లారు. ఆ సమయంలో ఒక వ్యక్తి ఇంటి తాళాలు, తలుపులను బద్దలు కొట్టేందుకు ప్రయత్నించాడు. ఇది గమనించిన పక్కింటి వారు పట్టుకోవడానికి ప్రయత్నించగా హరేరామ గుడి వరకూ పరారయ్యాడు. అక్కడ స్థానికులు పట్టుకోగా వారిపై తిరగబడ్డాడు. దీంతో స్థానికులు అతనికి దేహశుద్ధి చేసి పోలీసులకు సమాచారం ఇచ్చారు. గొల్లప్రోలు పోలీసులు సదరు వ్యక్తిని అదుపులోకి తీసుకుని ప్రశ్నిస్తున్నారు.



భైరవపాలెం సమీపంలో నడి సముద్రంలో అగ్నిప్రమాదంలో చిక్కుకున్న బోటు

బోటులో వంట చేస్తుండగా గ్యాస్ లీకై అగ్నిప్రమాదం

- నడి సముద్రంలో బుగ్గి
- సురక్షితంగా బయటపడ్డ 11 మంది జాలర్లు

ఉప్పాడ (కొత్తపల్లి), ఫిబ్రవరి 12: నడి సముద్రంలో బోటులో వంట చేస్తుండగా గ్యాస్ లీకై ఆయిల్ ట్యాంక్ పేలిన సంఘటనలో బోటు పూర్తిగా దగ్ధమైందని ఉప్పాడ మత్స్యకార నాయకుడు, గ్రామ సర్పంచ్ ఉమ్మిడి జాన్ తెలిపారు. సూరాడపేటకు చెందిన సూరాడ కృష్ణ ఇంజన్ బోటుపై అదే పేటకు చెందిన 11 మంది మత్స్యకారులు సోమవారం తెల్లవారుజామున నడిసముద్రంలోకి చేపల వేటకు బయలుదేరారు. ఉప్పాడ తీరం నుంచి సముద్రం భైరవపాలెం వైపునకు వేట చేస్తూ వెళ్లారు. మధ్యాహ్నం భోజనం తయారు చేసుకొనేందుకు బోటులోనే వంట చేసేందుకు గ్యాస్ స్టౌ వెలిగించారు. అప్పటికే లీకై ఉన్న గ్యాస్ స్టౌ వెలిగించిన క్షణాల్లో పక్కనే బోటు డీజిల్ ట్యాంక్ అంటుకోవడం ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. దీంతో బోటులో ఉన్న మత్స్యకారులు హాహాకారాలు చేస్తుండడాన్ని గుర్తించిన సహచర మత్స్యకారులు వారిని వేరే బోటులో ఎక్కించి రక్షించారని సర్పంచ్ జాన్ తెలిపారు. మత్స్యకారులంతా సురక్షితంగా బయటపడగా, ఈ ప్రమాదంలో వేటాడిన చేపలు, వలలు, బోటు పూర్తిగా కాలిపోవడంతో రూ.25 లక్షల నష్టం వాటిల్లిందని చెప్పారు.

చెట్టు పైనుంచి పడి వ్యక్తి మృతి



మోతుగూడెం, ఫిబ్రవరి 12: మల్లారం గ్రామంలో జీలుగకల్లు తీయడానికి చెట్టు ఎక్కిన వ్యక్తి కాలుజారి కిందపడడంతో మృతి చెందాడు. ఎం.రామసుందరం (30) ఆదివారం రాత్రి జీలుగకల్లు తీయడానికి వెళ్లాడు. ఎంతసేపటికీ ఇంటికి రాకపోవడంతో భార్య గురుహరి చెట్టు వద్దకు వెళ్లి చూసింది. కింద పడి ఉన్న భర్తను చూసి చుట్టుపక్కల వారిని అక్కడికి తీసుకెళ్లింది. వారు రామసుందరాన్ని ప్రభుత్వాసుపత్రికి తరలించగా అప్పటికే మరణించినట్టు వైద్యులు ధ్రువీకరించారు. కేసును మోతుగూడెం ఎస్ఐ జి. గోపాలరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. రామసుందరంనకు ముగ్గురు ఆడపిల్లలు.



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కుటుంబ సభ్యులు

అప్పులబాధ తాళలేక కుటుంబం ఆత్మహత్యాయత్నం

యానాం ప్రభుత్వాసుపత్రిలో చికిత్స

యానాం, ఫిబ్రవరి 12: అప్పుల బాధ తాళలేక లేక యానాంలో ఒక కుటుంబం ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఈ ఘటనకు సంబంధించిన సెల్ఫీ వీడియో బయటకు రావడంతో స్థానికులు హుటాహుటిన ఇంటికి వెళ్లి వారిని యానాం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రసుతం యానాం ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. వారి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని తెలిసింది. స్థానిక దంగేటివారి వీధిలోని అద్దె ఇంట్లో నివశిస్తున్న దేగల సునీత తన ఇద్దరు కుమారులతో కలిసి చీమలమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. తన భర్త శ్రీను కొత్తపేటకు చెందిన పోశారావు దగ్గర రూ.15 వేలు తీసుకున్న అప్పు కట్టినప్పటికీ వడ్డీ పేరుతో మళ్లీ కట్టాలని వేధించారన్నారు. అయితే రూ.30 వేలు కట్టినప్పటికి అనంతరం రూ.1.50 లక్షలకు కోర్టు నుంచి నోటీసు పంపడంతో ఒత్తిడి భరించలేక తాగుడుకు బానిసై తన భర్త మృతి చెందడం జరిగిందన్నారు. తన భర్త చనిపోయి నెల గడవకముందే అప్పు చెల్లించాలని పోశారావు ఒత్తిడి తేవడం తన కుమారులు శ్రీరాజు, తేజలను వేధించడంతో ఏమీచేయలేని నిస్సహాయస్థితితో ఉన్న తాము చనిపోవాలని నిర్ణయించుకుని సెల్ఫీ వీడియో తీసుకుని చీమల మందు తాగారు. ఈ వీడియో చూసిన కుటుంబసభ్యులు, స్థానికులు వారిని ఆసుపత్రికి తరలించారు. ఈ సంఘటనకు సంబంధించిన పూర్తి వివరాలను పోలీసులు సేకరిస్తున్నారు.



కిడ్నీ వ్యాధిగ్రస్త బాలుని కుటుంబానికి రూ.10 లక్షల చెక్కును అందిస్తున్న ఎంఈవోలు, ఎడ్యుకేర్ స్కూలు కరస్పాండెంట్ తదితరులు

ఎడ్యుకేర్ విద్యార్థుల ఔదార్యం

వైద్య అవసరాల కోసం బాలునికి రూ.10 లక్షల ఆర్థిక సాయం

మామిడికుదురు, ఫిబ్రవరి 12: నగరం ఎడ్యుకేర్ ఇంగ్లీషు మీడియం స్కూలులో 8వ తరగతి చదువుతున్న బళ్ల రామ్‌యోచన్ గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఆ బాలుడిని వైద్యులకు చూపించగా రెండు కిడ్నీలు పాడైపోయాయని చెప్పడంతో కుటుంబ సభ్యులు ఆందోళనలో పడ్డారు. ప్రతీ రెండు రోజులకు డయాలసిస్ చేస్తున్నప్పటికీ వైద్యులు కిడ్నీ మార్పిడి చేయాలని, దానికి రూ.15 లక్షలు ఖర్చు అవుతుందన్నారు. దీనిపై స్పందించిన ఎడ్యుకేర్ విద్యాసంస్థల కరస్పాండెంట్ మురార్జీ సూచన మేరకు విద్యాసంస్థల ఉపాధ్యాయులు, సహ విద్యార్థులు విరాళాలుగా రూ.10 లక్షలు సేకరించారు. ఈ మొత్తాన్ని చెక్కు రూపంలో ఎంఈవోలు సీహెచ్ లక్ష్మీనారాయణ, వెంకన్నబాబు బాలుని కుటుంబ సభ్యులకు సోమవారం అందించారు. సహ విద్యార్థిని ఆదుకోవడానికి ముందుకొచ్చిన విద్యార్థులు, ఉపాధ్యాయులను ఎంఈవోలు అభినందించారు. కార్యక్రమంలో విద్యా సంస్థల అధినేత కె.మురార్జీ, డైరెక్టర్ కె.సత్యవాణి, ప్రిన్సిపాల్ భాస్కర శ్రీనులు పాల్గొన్నారు.



మండపేట ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యసేవలకోసం నిరీక్షించిన దృశ్యం

వైద్యం కోసం బిడ్డతో బాలింత నిరీక్షణ

జనసైనికుల స్పందనతో కాకినాడ తరలింపు

మండపేట, ఫిబ్రవరి 12: మండపేట ప్రభుత్వాసుపత్రికి వైద్యం కోసం వచ్చిన గిరిజన మహిళ నాలుగు గంటలు వైద్యుల కోసం నిరీక్షించినా స్పందన లేదు. దీంతో జనసైనికులు బాలింతను బిడ్డను 108లో కాకినాడకు తరలించి ప్రాణాలను కాపాడారు. విశాఖ జిల్లా కాకరపాడు గ్రామానికి చెందిన గిరిజన మహిళ మర్రికాంతమ్మ కుటుంబంతో పొట్టకూటి కోసం కపిలేశ్వరపురం మండలం వెదురుమూడి వచ్చింది. ఆమె ఆదివారం తాపేశ్వరంలోని బంధువుల ఇంటికి వెళ్లింది. అక్కడే బిడ్డకు జన్మనిచ్చింది. ఆమెను వైద్యం కోసం బంధువులు కేశవరం ప్రభుత్వాసుపత్రికి తీసుకువెళ్లారు. అక్కడి వైద్యుల సూచనతో సోమవారం మండపేట ఆసుపత్రికి బిడ్డతో బాలింత వచ్చింది. నాలుగు గంటలు నిరీక్షించినా అక్కడ వైద్యులు అందుబాటులో లేరు. దీంతో జనసైనికులు స్పందించి ఆమెను, బిడ్డను 108లో కాకినాడ ప్రభుత్వాసుపత్రికి పంపించారు. జనసేన మను కృష్ణ, ఇప్పనపాడు ఉపసర్పంచ్ కుంచే దుర్గాప్రసాద్ మండపేట ప్రభుత్వ ఆసుపత్రి వైద్యుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు.



గోల్డ్ మెడల్‌తో నాగిరెడ్డి

వరల్డ్ మాస్టర్ అథ్లెటిక్స్‌కు ఎంపికైన వ్యాయామ ఉపాధ్యాయుడు

ఎటపాక, ఫిబ్రవరి12: అల్లూరి జిల్లా ఎటపాక మండలం నల్లకుంట గిరిజన బాలుర ఆశ్రమ ఉన్నత పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు సొడి నాగిరెడ్డి వరల్డ్ మాస్టర్ అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికయ్యారు. ఈనెల 8 నుంచి 11వ తేదీ వరకు తెలంగాణలోని హైదరాబాద్ గచ్చిబౌలి స్టేడియంలో నిర్వహించిన 5వ నేషనల్ మాస్టర్ అథ్లెటిక్స్ పోటీలో నాగిరెడ్డి షాట్‌పుట్ విభాగంలో గోల్డ్ మెడల్, జావలిన్ త్రో విభాగంలో సిల్వర్ మెడల్స్‌ను సాధించారు. దాంతో నాగిరెడ్డి వరల్డ్ మాస్టర్ అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికయ్యారు. త్వరలో ఇతర దేశంలో జరగనున్న పోటీల్లో నాగిరెడ్డి పాల్గొననున్నారు. దీంతో నాగిరెడ్డిని విలీన మండలాల్లోని అనేక మంది ఉపాధ్యాయులు అభినందించారు.

జనసేనలో 150 కుటుంబాలు చేరిక

ఎటపాక, ఫిబ్రవరి12 ఎటపాక మండలం కన్నాయిగూడెంలోని శ్రీరామ్ నగర్‌కాలనీలో సుమారు 150 కుటుంబాలు సోమవారం జనసేన పార్టీలో చేరాయి. ఆ పార్టీ మండలాధ్యక్షుడు మారాసు గంగాధర్ వారికి పార్టీ కండువా కప్పి సాదరంగా జనసేనలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు సైతం పాల్గొన్నారు. ఈ సందర్భంగా మారాసు గంగాధర్ మాట్లాడుతూ పవన్‌కల్యాణ్ సిద్ధాంతాలకు ఆకర్షితులై పార్టీలో చేరినట్టు వారంతా తెలిపారు. ఈ కార్యక్రమంలో రంపచోడవరం జనసేన మండల అధ్యక్షుడు పి. శ్రీనివాసరావు, జనసేన సీనియర్ నాయకులు పయ్యావుల నాగేశ్వరరావు, టీడీపీ, జనసేన నాయకులు బండారి భద్రరావు, కొమ్ము మహేష్, కొమ్ము వినయ్, సూరిశెట్టి సురేష్, దేగల మరళి తదితరులు పాల్గొన్నారు.

రేపు టిడ్కో గృహాల పంపిణీకి ఏర్పాట్లు

మండపేట, ఫిబ్రవరి 12: స్థానిక గొల్లపుంతకాలనీలో ఉన్న టిడ్కోగృహాలు రెండో దశకు సంబంధించి వెయ్యి గృహాలు ఈనెల14న లబ్ధిదారులకు అందించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈమేరకు టిడ్కో అధికారులతో స్థానిక నేతలు, మున్సిపల్ అధికారులు సోమవారం చర్చించారు. గొల్లపుంతలోని టిడ్కో గృహాల సముదాయంలో మౌలిక వసతులు కల్పించి లబ్ధిదారులకు ఇళ్లను అందిస్తామని అధికారులు తెలిపారు. ఈమేరకు ఏర్పాట్లు చేస్తున్నామని వారు తెలిపారు.

● కలెక్టరేట్ ఎదుట ఐక్య జేఏసీ ఆధ్వర్యంలో ధర్నా
● పెన్షన్‌ను రూ.6వేలకు పెంచాలని, అంత్యోదయ కార్డులు అందించాలని డిమాండ్

అన్నక్యాంటీను వద్ద 500రోజుల వేడుకలు


అమలాపురం అన్నక్యాంటీను వద్ద కేక్ కట్‌చేస్తున్న హరీష్, ఆనందరావు, రమణబాబు తదితరులు

అమలాపురం, ఫిబ్రవరి12 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ దివంగత స్పీకర్ జీఎంసీ బాలయోగి తనయుడు, టీడీపీ అమలాపురం పార్లమెంటరీ ఇన్‌చార్జి గంటి హరీష్‌మాధుర్ ఆధ్వర్యంలో అమలాపురం మెయిన్‌రోడ్డులో ఏర్పాటుచేసిన అన్నక్యాంటీను ప్రారంభించి 500రోజులు పూర్తిచేసుకున్న సందర్భంగా సోమవారం వేడుకలు నిర్వహించారు. ఇప్పటివరకు 1.50లక్షలమందికి భోజనాలు పెట్టినట్టు హరీష్‌మాధుర్ తెలిపారు. మాజీ ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబు, రాష్ట్రకార్యదర్శి పెచ్చెట్టి చంద్రమౌళి, తెలుగు మహిళ జిల్లా అధ్యక్షురాలు పెచ్చెట్టి విజయలక్ష్మి సమక్షంలో భారీ కేక్‌ను కట్‌చేశారు. 500వరోజు ప్రత్యేకఅన్నదానం నిర్వహించారు. జనసేన అమలాపురం పార్లమెంటరీ ఇన్‌చార్జి డీఎంఆర్ శేఖర్, మాజీ ఎమ్మెల్యే మానేపల్లి అయ్యాజీవేమా, నాయకులు చిక్కాల గణేష్, గంధం పల్లంరాజు, బత్తుల ప్రసాద్, నల్లా స్వామి, సలాది సతీష్‌రాజు, జిల్లా నలుమూలల నుంచి వచ్చిన నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని అన్నార్తులకు భోజనాలు అందించారు. వారితో సహపంక్తి భోజనాలు చేశారు.

గ్రామాల అభివృద్ధిపై ఎమ్మెల్సీకి ఎమ్మెల్యే వేగుళ్ల చాలెంజ్

కపిలేశ్వరపురం, ఫిబ్రవరి 12: టేకి, మాచర, కోరుమిల్లి, వాకతిప్ప, నాగులచెరువు, అద్దంకివారిలంక వైసీపీ ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి ఏమిఅభివృద్ధి జరిగిందో చెప్పాలని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులుకు ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు చాలెంజ్ విసిరారు. సోమవారం టేకిలో గ్రామటీడీపీ అధ్యక్షుడు మేడిశెట్టి వెంకటరమణ అధ్యక్షతన జరిగిన బీసీ జయహో కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. 1994నుంచి 2004 వరకు రామచంద్రపురం అధికార పార్టీ శాసనసభ్యునిగా ఉండి, ఆ నియోజకవర్గంలో ఉన్న ఈ ఆరు గ్రామాల్లో ఏమి అభివృద్ధి సాధించారని ఎమ్మెల్యే ప్రశ్నించారు. ఐదేళ్ల కాలంలో ఈ ఆరుగ్రామాల్లో అయనకంటే తక్కువ అభివృద్ధి చేసి ఉంటే ఈఎన్నికల్లో పోటీచేయనని ఎమ్మెల్యే వేగుళ్ల చాలెంజ్ చేశారు. అనంతరం బాబూ ష్యూరిటీ-భవిష్యత్‌కు గ్యారంటీ కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే వేగుళ్ల పార్టీ శ్రేణులతో కలిసి గ్రామంలో పర్యటించి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు రెడ్డి ప్రసాద్, కొప్పిశెట్టి వాసు, గుడాల జయబాబు, కాదా వెంకటరాంబాబు, కుక్కల రామారావు, వాసంశెట్టి సత్యనారాయణ, మేడిశెట్టి శ్రీను, చింతపల్లి రామకృష్ణ, వివిధ గ్రామాలకు చెందిన టీడీపీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు

అంతా గప్‌చుప్.... అంకంపాలెం ఇసుక రీచ్‌ను పరిశీలించిన కలెక్టర్

ఆత్రేయపురం, ఫిబ్రవరి 12: కొత్తపేట నియోజకవర్గంలో అనుమతి పొందిన ప్రతిమ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కంపెనీ నిబంధనలకు విరుద్ధంగా బొండు మట్టి, అక్రమ తవ్వకాలు జోరుగా సాగుతున్నాయి. జిల్లా ఇసుక కమిటీ ఈ అక్రమార్కులకు చెక్‌పెట్టలేకపోతోంది. తమ సరిహద్దులోకి వచ్చి అక్రమంగా తవ్వకాలు చేస్తున్నారంటూ సర్పంచ్ మెర్ల రాము జిల్లా అధికారులకు ఫిర్యాదు చేశారు. దీనిపై అధికారులు స్పందించి అక్రమార్కులపై వేటు వేయకపోవడంతో సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో కలెక్టర్ హిమాన్షు శుక్లా సోమవారం అంకంపాలెం ఇసుక రీచ్‌లో వివిధ శాఖల జిల్లా అధికారులతో కలిసి పరిశీలించారు. ఊబలంక, గోపాలపురంలో రీచ్‌ల్లో ఇసుక అక్రమ తవ్వకాలను సోమవారం నిలుపుదలచేశారు. దీంతో అక్రమార్కులు తవ్వకాలు సాగించే యంత్రాలు, లారీలను రహస్య ప్రాంతాలకు తరలించారు. అక్కడ సిబ్బంది ఎవ్వరూ లేకుండా సెలవు ప్రకటించారు.

ఇసుక, మట్టి ర్యాంపులు మూత

పి.గన్నవరం, ఫిబ్రవరి 12: నేషనల్ గ్రీన్‌ట్రిబ్యునల్, మైన్స్ అధికారులు కోనసీమలో ఉన్న ముఖ్యంగా ఇసుక ర్యాంపులు, మట్టిర్యాంపులను, గోదావరినది పరివాహక ప్రాంతాలను పరిశీలిస్తారన్న సమాచారంతో జిల్లాలో కొన్ని రోజులుగా జోరుగా సాగుతున్న ఇసుక, మట్టి తవ్వకాలకు సోమవారం పూర్తిగా బ్రేక్‌పడింది. పరిశీలన అనంతరం కొత్త ర్యాంపులు మంజూరు చేయడంతో పాటు పాత ర్యాంపులకు అనుమతులు పరిశీలిస్తారని తెలిసింది. వర్క్‌ఆర్డర్ల పేరుతో విచ్చలవిడిగా సాగిన తవ్వకాలపై ర్యాంపు నిర్వాహకులపై తీసుకునే చర్యలపై పలువురు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఇప్పటి వరకు ర్యాంపుల్లో ఎక్స్‌కవేటర్లతో సాగిన తవ్వకాలు ఒక్కసారిగా ఆగిపోవడంతో పాటు ర్యాంపు పరిసరాల్లో ఏకంపెనీకి చెందిన ప్రతినిధి కనబడకపోవడం గమనర్హం.

జనసేనలో పలువురు నాయకుల చేరిక

పి.గన్నవరం, ఫిబ్రవరి 12: ముంగండపాలేనికి చెందిన పలువురు వైసీపీ కార్యకర్తలు స్థానికులు మట్టపర్తి శ్రీను, పేరాబత్తుల లక్ష్మీనారాయణ సంయుక్త ఆధ్వర్యంలో జనసేన పార్టీలో చేరినట్లు నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జ్ గిడ్డి సత్యనారాయణ తెలిపారు. సత్యనారాయణ తెలిపారు. ముంగండపాలెంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గ్రామస్థాయిలో పార్టీని బలోపేతం చేసి ఎన్నికల్లో టీడీపీ-జనసేన ఉమ్మడి అభ్యర్థి గెలుపునకు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో జనసేన జిల్లా ఉపాధ్యక్షుడు శిరిగినీడి వెంకటేశ్వరరావు, జిల్లా కార్యదర్శి వాసంశెట్టి కుమార్, పార్టీ మండల అధ్యక్షుడు సాధనాల శ్రీవెంకటసత్యనారాయణ, ఎంపీపీ గనిశెట్టి నాగలక్ష్మి, దొమ్మేటి సాయికృష్ణ, పోలిశెట్టి రాజేష్, సలాది బుచ్చిరాజు, ఆదిమూలం సూరయ్యకాపు, తాటికాయల వెంకటేష్, నక్కా నరేష్, శ్రీకాంత్, కార్తిక్ తదితరులు పాల్గొన్నారు.

రహదారుల ఆధునికీకరణకు కృషి

మామిడికుదురు, ఫిబ్రవరి 12: రహదారుల ఆధునికీకరణకు ప్రభుత్వం కృషి చేస్తుందని జడ్పీటీసీ కసిరెడ్డి అంజిబాబు, ఎంపీటీసీ కుసుమ వనజాకుమారి అన్నారు. రూ.1.20కోట్లతో మాకనపాలెంలో రోడ్లఅభివృద్ధి పనులకు సోమవారం వారు భూమిపూజచేశారు. స్కూలు భవన నిర్మాణానికి కలెక్టర్ సీఎస్ఆర్ నిధుల ద్వారా రూ.12లక్షలు మంజూరుచేశారని, గ్రావెల్‌రోడ్డు అభివృద్ధికి రూ.3లక్షలు మంజూరయ్యాయన్నారు. మద్దాల బాబూరావు, ఎంపీటీసీ వలవల పెదబాబు, చెల్లింగి రామకృష్ణ, భూపతి దామోదరరావు, కాండ్రేగుల శ్రీనివాస్ పాల్గొన్నారు.

మద్యం విక్రయిస్తున్న వ్యక్తి అరెస్టు

అంబాజీపేట, ఫిబ్రవరి 12: చిరతపూడి చిట్టిచెరువులో మద్యం విక్రయిస్తున్న చిట్టూరి వెంకటరమణను అరెస్టుచేసి కోర్టులో హాజరుపరిచినట్లు ఎస్ఐ కె.చిరంజీవి తెలిపారు. రూ.5920 విలువైన 180ఎంఎల్ 42మద్యం బాటిల్స్ స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

బీజేపీ మహిళా మోర్చా అధ్యక్షురాలిగా భారతి

కె.గంగవరం, ఫిబ్రవరి 12: బీజేపీ మహిళా మోర్చా మండల అధ్యక్షురాలిగా కాద భారతి నియమితులయ్యారు. సోమవారం నియామక పత్రాన్ని పార్టీ మండల అధ్యక్షుడు అవసరాల రమణమూర్తి, కిసాన్ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి గుర్రాల సత్యనారాయణ, ఓబీసీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి కాదవెంకటరమణ ఆమెకు అందజేశారు.

దివ్యాంగుల సమస్యల పరిష్కారానికి ర్యాలీ

అమలాపురం టౌన్, ఫిబ్రవరి 12: న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ దివ్యాంగుల ఐక్య జేఏసీ జిల్లా శాఖ ఆధ్వర్యంలో సోమవారం మోటారు సైకిళ్లపై ర్యాలీ నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన దివ్యాంగులు అమలాపురం హైస్కూలు సెంటరు నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ జరిపారు. కలెక్టరేట్ ఎదుట భారీ ధర్నా చేపట్టారు. దివ్యాంగులకు పెన్షన్‌ను రూ.3వేలు నుంచి రూ.6వేలకు పెంచాలని, అంత్యోదయకార్డులు అందించాలని, ప్రత్యేక రిజర్వేషన్లు కల్పించాలని, పెండింగులో ఉన్న బ్యాగ్‌లాగ్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని, కాంట్రాక్టు, ప్రభుత్వ ఉద్యోగాలు కల్పించి ఆదుకోవాలని ప్లకార్డులు చేతబూని పెద్ద ఎత్తుననినాదాలు చేశారు. జేఏసీ జిల్లా శాఖ అధ్యక్షుడు పెనుమాల నాగరాజు మాట్లాడుతూ అర్హత కలిగిన విభిన్న ప్రతిభావంతులకు ఇళ్ల స్థలాలు ఇచ్చి ప్రభుత్వమే ఇళ్లునిర్మించి ఇవ్వాలని డిమాండు చేశారు. విభిన్నప్రతిభావంతుల హక్కుల చట్టం- 2016ను సమర్థవంతంగా అమలు చేయాలన్నారు. కలెక్టర్ హిమాన్షు శుక్లాను కలిసి వినతిపత్రం అందజేశారు. ధర్నాలో జిల్లా కార్యదర్శి కొప్పాడి సత్యవెంకటనాగరాజు, కోశాధికారి కొసన సత్యసుబ్రహ్మణ్యం, ఉపాధ్యక్షుడు పచ్చిపాల శ్రీను, సంయుక్త కార్యదర్శి జనిపెల్ల సంపత్‌కుమార్, నాయకులు గంటా గోవిందు, జొన్నాడ రాజు, నలమాటి లంకరాజు, పితాని ఏసుబాబు, నరసింహస్వామి, రాయుడు బాబి, బండారు లక్ష్మణ్, కోలా భూషణం, చిలకలపూడి నరసింహస్వామి, మీరాసాహెబ్, సలాది మూర్తి, మోటూరి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.


కలెక్టరేట్ ఎదుట దివ్యాంగుల ధర్నా, ప్లకార్డుల ప్రదర్శన

ఘనంగా బీబీ జైనాబ్ జయంత్యుత్సవం

మామిడికుదురు, ఫిబ్రవరి 12: ముస్లింల ఆరాధ్య దైవం ఇమామ్ హజరత్ అలీ తనయురాలు బీబీ జైనాబ్ జయంత్యుత్సవాన్ని నగరం, మామిడికుదురులలో సోమవారం ఆనందోత్సాహాల మధ్య ఘనంగా జరుపుకున్నారు. మామిడికుదురులోని అలందార్ అబ్బాస్ పంజాలో, నగరంలోని మంజిలే కర్బలాలో మిలాద్‌లు జరిగాయి. మహ్మద్ కాశింరజా(రజీ) ఆధ్వర్యంలో జరిగిన ఈమిలాద్‌లో సుదూర ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. మత ప్రబోధకులు సయ్యద్ అబ్బాస్‌బాకరీ మిలాద్ ఆలపించారు. పలువురు కవులు పాల్గొని బీబీజైన్ జీవిత చరిత్రలోని ముఖ్య ఘట్టాలు, మహిమలను తమ కవిత్వాల ద్వారా భక్తులకు వివరించారు. ఆయా కార్యక్రమాల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

నిత్యాన్నదానానికి విరాళం

మామిడికుదురు, ఫిబ్రవరి 12: అప్పనపల్లి బాలబాలాజీ స్వామి నిత్యాన్నదాన పథకానికి హైదరాబాద్‌కు చెందిన పోలే వెంకటలక్ష్మి, కుడుపూడి సునీత, గుబ్బల విజయలక్ష్మి, పితాని రజనీలు రూ.50,232 విరాళంగా అందించారని సహాయ కమిషనర్ జి.మాధవి తెలిపారు. వారికి చైర్మన్ చిట్టూరి రామకృష్ణ స్వామివారి చిత్రపటం, ప్రసాదం అందించి అభినందించారు.

అన్నదాన భవన నిర్మాణానికి విరాళం

ఆత్రేయపురం, ఫిబ్రవరి 12: కోనసీమ తిరుమల వాడపల్లిలో వకుళమాత అన్నప్రసాద భవన నిర్మాణానికి రాజానగరానికి చెందిన ఎ.సాయిరామ్-స్వాతిమణి దంపతులు రూ.60,500 విరాళం సమర్పించారు. వారికి ఈవో బి.కిషోర్‌కుమార్ స్వామివారి చిత్రపటం అందజేశారు.

కోనసీమ రైల్వే లైన్ నిర్మాణ పనులపై సమీక్ష

అమలాపురం టౌన్, ఫిబ్రవరి 12: కోనసీమ జేఏసీ కార్యవర్గ సమావేశాన్ని సోమవారం జేఏసీ కార్యాలయంలో చైర్మన్ వాసా ఎస్.దివాకర్ అధ్యక్షతన నిర్వహించి కోటిపల్లి-నర్సాపురం రైల్వేలైన్ నిర్మాణ పనులపై సమీక్షించారు. కోటిపల్లిలో గౌతమి నది వద్ద గడ్డర్ల నిర్మాణ పనుల్లో జాప్యంపై కన్వీనర్ బండారు రామ్మోహనరావు దక్షిణ మధ్య రైల్వే కార్యాలయానికి ఫోన్‌చేసి సమాచారం తెలుసుకున్నారు. త్వరలోనే పనులు ప్రారంభిస్తామన్నారు. ప్రాజెక్టు నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం తన వాటాగా రూ.50కోట్లు మంజూరు చేయడమే కాకుండా భూసేకరణకు చొరవ తీసుకోవడంపై కృతజ్ఞతలు తెలిపారు. భూసేకరణ త్వరితగతిన పూర్తిచేసి రైల్వే శాఖకు అప్పగించాలని సంబంధిత అధికారులను కోరుతూ తీర్మానించారు. సమావేశంలో సహ కన్వీనర్ మంత్రిప్రగడ వేణుగోపాల్, నాయకులు రంకిరెడ్డి కాశీవిశ్వనాథం, కరాటం ప్రవీణ్, నంద్యాల నాయుడు, డాక్టర్ రాయుడు శ్రీరామచంద్రమూర్తి, పీఎస్ సుందరరామయ్య, సోమేష్ పాల్గొన్నారు.

బీసీలకు తీవ్ర అన్యాయం చేసిన జగన్

రావులపాలెం,ఫిబ్రవరి 12:బీసీలపై కపటప్రేమ చూపుతూ వారికి వైసీపీ ప్రభుత్వం తీరని అన్యాయం చేసిందని మాజీఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. రావులపాడులో సోమవారం బాబుష్యూరిటీ... భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ తిరిగి టీడీపీ-జనసేన సంయుక్త ప్రభుత్వం అధికారంలోకి రాగానే చేపట్టబోయే అభివృద్ధి కార్యక్రమాలువివరించారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

మండల సమావేశంలో సభ్యుల భర్తల హంగామా

మండపేట, ఫిబ్రవరి 12: మండపేట మండల సమావేశంలో సభ్యులుకానివారు హాజరై సమస్యలపై అధికారు లను ప్రశ్నించారు. మండలపరిషత్ సమావేశం ఎంపీడీవో ఆర్.శ్రీదేవి అధ్యక్షతన సోమవారంజరిగింది. సమావేశానికి ఎంపీపీ, ఎంపీటీసీలు, అధికారులు హాజరయ్యారు. సమావేశానికి జడ్పీటీసీ భర్త ఆమెకు బదులుగా సమావేశ మందిరంలో ఎంపీపీ, అధికారులు చెంత కూర్చున్నారు. మరో ఎంపీటీసీ భర్త, మరో సర్పంచ్ భర్త కూడా సమావేశానికి హాజరయ్యారు. ఇలాసభ్యులు కానీ వారు మండల సమావేశానికి హాజరవుతున్నా అధికారులు చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. సమావేశంలో ఎంపీపీ వాసు మాట్లాడుతూ ప్రతిపక్ష టీడీపీ గతంలో చేసిన అభివృద్ధి పనులను గ్రామాల్లో ఫ్లెక్సీల రూపంలో పెడుతూ చేస్తున్న ప్రచారాన్ని తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. తహసీల్దార్ సురేష్‌బాబు మాట్లాడుతూ ఎన్నికలు సక్రమంగా జరిగేలా ప్రజలు ప్రజాప్రతినిధులు సహకరించాలని కోరారు.వెలగతోడు, మాంటిక్లేర్ కాల్వ పూడిక పెరిగిపోయి సాగునీరు అందటం లేదని సభ్యులు ఆవేదన వ్యక్తంచేశారు. మెర్నిపాడుకు జేగురుపాడు నుంచి వచ్చే పంట బోదె పూడుకు పోవడంతో సాగునీరు అందటం లేదని సర్పంచ్ భర్త అధికారుల దృష్టికి సమావేశంలో తీసుకువచ్చారు. వివిధశాఖల అధికారులు ఆయా శాఖల ఆధ్వర్యంలో చేపట్టిన అభివృద్ధి పనులను వివరించారు. సమావేశానికి పలు శాఖల అధికారులు డుమ్మాకొట్టారు. సమావేశంలో వైస్ ఎంపీపీలు, ఎంపీటీసీలు, పంచాయతీ కార్యదర్శులు ఈవోపీఆర్డీ రాజు తదితరులు పాల్గొన్నారు.


మండల సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ వాసు, వేదికపై జడ్పీటీసీ భర్త (మార్కింగ్ చేసిన వ్యక్తి).

బెదిరింపులతో వైసీపీ కండువాలు.. బండారు వెంటే బుడగ జంగాలు

మాజీ సర్పంచ్ భీమ్‌సేన్, బుడగజంగ అధ్యక్షుడు వెంకన్న ఆధ్వర్యంలో 250మంది దేశం గూటికి


ఉచ్చిలిలో బుడగ జంగాలను టీడీపీలో చేరుతున్న వారికి కండువా కప్పుతున్న బండారు సత్యానందరావు

ఆత్రేయపురం, ఫిబ్రవరి 12: మండలంలోని ఉచ్చిలి బుడగ జంగాల కాలనీలో సుమారు 250 మంది టీడీపీ మండల శాఖ అధ్యక్షుడు ముదునూరి వెంకట్రాజు, వాడపల్లి దేవస్థానం మాజీ చైర్మన్ తోటకూర సుబ్బరాజు ఆధ్వర్యంలో టీడీపీలో భారీగా చేరారు. మాజీ సర్పంచ్, దళిత నేత ఆకాశం భీమ్‌సేన్, బుడగ జంగాల సంఘం అధ్యక్షుడు నీరుకొండ వెంకన్న, అతని అనుచరులకు టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే బండారు సత్యానందరావు కండువాలు వేసి స్వాగతం పలికారు. కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌చార్జిలు ముళ్ళపూడి భాస్కరరావు, కరుటూరి నరసింహరావు తదితరులు పాల్గొన్నారు. అనంతరం వెలిచేరులో టీడీపీ గ్రామ శాఖ అధ్యక్షుడు కవల సత్తిబాబు ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ-భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా యువ నేత బండారు సంజీవ్ ఇంటింటికీ వెళ్లి బాండ్లు అందజేశారు.

ఫెలోషిప్ అధ్యక్షుడిగా కృపానందం

కె.గంగవరం, ఫిబ్రవరి 12: ద్రాక్షారామ పరిసర ప్రాంతాల పాస్టర్స్ ఫెలోషిప్ నూతన అధ్యక్షుడిగా టి.కృపానందం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సోమవారం ఊడిమూడి చర్చిలో పాస్టర్లు సమావేశమై నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా టి.కృపానందం, ఉపాధ్యక్షుడిగా జె.వి.ప్రసాద్, కార్యదర్శిగా పి.విజయరత్నం, ఉపకార్యదర్శిగా హిజ్కియారాజు, కోశాధికారిగా జి.మోజెష్, ఉప కోశాధికారిగా వి.సందీప్‌లు ఎన్నికయ్యారు. రెండేళ్లు ఈకార్యవర్గం కొనసాగుతుంది.

అభివృద్ధి టీడీపీ,జనసేన ప్రభుత్వంతోనే సాధ్యం

ద్రాక్షారామ, ఫిబ్రవరి 12: టీడీపీ, జనసేన సంకీర్ణ ప్రభుత్వంతోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి రెడ్డి సుబ్రహ్మణ్యం, జనసేన ఇన్‌చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్ అన్నారు. సోమవారం రాత్రి చోడవరంలో టీడీపీ, జనసేన ఆధ్వర్యంలో భవిష్యత్‌కు గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో పర్యటించి టీడీపీ మేనిఫెస్టో పథకాలు వివరించారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పంటకాల్వలోకి దూసుకెళ్లిన కారు

మండపేట, ఫిబ్రవరి 12: తాపేశ్వరం రోడ్డులో మెహర్ సెంటరు దాటిన తర్వాత మలుపు వద్ద సోమవారం కారు అదుపుతప్పి పంటకాల్వలో బోల్తా కొట్టింది. అటుగా వెళ్తున్న వాహనదారులు స్పందించి బోల్తాపడిన కారులో ఉన్న అర్తమూరుకు చెందిన చిర్ల రామకృష్ణారెడ్డిని బయటకు తీశారు. స్వల్పగాయాలయ్యాయి. మలుపులో కల్వర్టును నిర్మించి ప్రమాదాలను నివారించాలని ప్రజలు కోరుతున్నారు.

టీడీపీలో పలువురు చేరిక

మండపేట, ఫిబ్రవరి 12: మండపేటకు చెందిన కాపు నేతలు మద్దాల శ్రీనువాసు, మద్దాల వెంకటేష్, మద్దాల సాయికృష్ణలు సోమవారం టీఎన్‌టీయూసీ రాష్ట్ర అధికార ప్రతినిధి వాదా ప్రసాదరావు ఆధ్వర్యంలో ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు సమక్షంలో టీడీపీలో పార్టీ కార్యాలయంలో చేరారు. పార్టీలో చేరిన వారిని వేగుళ్ల పార్టీ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు ఉంగరాల రాంబాబు, మల్లిపూడి గణేష్, గనిశెట్టి బాబి, సిద్దిరెడ్డి రామన్న, కట్టుమేను వీర్రాజు, సుంకర శ్రీను, కొవ్వూరి ఆదిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి అంతర్జాతీయ యోగా గురువు యష్ పర్యటన

అమలాపురం టౌన్, ఫిబ్రవరి 12: అంతర్జాతీయ యోగా గురువు యష్ శేఖర్ మంగళవారం నుంచి మూడు రోజుల పాటు జిల్లాలో పర్యటిస్తారని దక్షిణాది రాష్ట్రాల ప్రతినిధి విశ్వనాథ్ తెలిపారు. మంగళవారం మధ్యాహ్నం 2గంటలకు అమలాపురం మండలం రంగాపురంలో, 14న అమలాపురం ఎర్రవంతెన దిగువన ఉన్న గాయత్రీమందిరంలో, 15న విద్యుత్ నగర్‌లోని ఆదిశేషా నిలయంలో జరిగే కార్యక్రమాల్లో యష్ శేఖర్ పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో నడింపల్లి రామకృష్ణంరాజు, సుభద్ర, చింతా శంకరమూర్తి తదితరులు పాల్గొన్నారు.

సిద్ధివినాయక ఆలయం వద్ద శాంతిహోమం

అల్లవరం, ఫిబ్రవరి 12: మొగళ్లమూరులోని శ్రీసిద్ధి వినాయక నూతన ఆలయం వద్ద విగ్రహ ప్రతిష్ఠలో భాగంగా వేదపండితుడు సుదర్శనం వెంకటజనార్దనాచార్యులు ఆధ్వర్యంలో అగ్ని ప్రతిష్ఠాపన, శాంతిహోమం, యాగశాల ప్రవేశ పూజలు జరిగాయి. మాజీ సర్పంచ్ కాండ్రేగుల సత్యనారాయణ, జవహర్‌లాల్, రాధాకృష్ణ, నాగేశ్వరరావు ఆధ్వర్యంలో హోమాలు, పూజలు నిర్వహించారు. ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు, సర్పంచ్ రాయుడు విష్ణుత్రిమూర్తులు, డాక్టర్ మాధవి, సంతోష్ పాల్గొన్నారు.

ప్రిన్సిపాల్‌ను సస్పెండ్ చేయాలి

ద్రాక్షారామ, ఫిబ్రవరి 12: ఆదివారపుపేటలోని డా. బీఆర్ అంబేద్కర్ సాంఘిక సంక్షేమ గురుకుల బాలుర పాఠశాలలో కలుషిత ఆహారంతో 52 మంది విద్యార్థులు అస్వస్థతకు గురైన నేపథ్యంలో ప్రిన్సిపాల్ ఎన్.వి.నాగేశ్వరరావును సస్పెండ్ చేయాలని పీడీఎస్‌యూ నాయకుడు బి.సిద్ధూ, అరుణోదయ ఉమ్మడి జిల్లా కార్యదర్శి వెంటపల్లి భీమశంకరం డిమాండు చేశారు. సోమవారం ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులను వారు పరామర్శించారు. సంఘటనపైసమగ్రదర్యాప్తు చేయాలన్నారు.

ఆర్థిక సాయం పంపిణీ

అంబాజీపేట, ఫిబ్రవరి 12: నందంపూడికి చెందిన నాగాబత్తుల మంగాదేవి క్యాన్సర్ వ్యాధితో బాధపడుతోంది. జనసేన పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు బెండా శ్రీనివాస్ సమకూర్చిన రూ.15వేలు, నిత్యవసరాలను పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు శిరిగినీడి వెంకటేశ్వరరావు సోమవారం ఆమెకు అందించారు. కార్యక్రమంలో నాయకులు దొమ్మేటి సాయికృష్ణ, అరిగెల సూరిబాబు, ఎంపీటీసీ వాకపల్లి దొరబాబు, యర్రంశెట్టి నాగేంద్ర, ఉందుర్తి రాంబాబు, నిమ్మకాయల లక్ష్మణ్, వాకపల్లి దుర్గాశ్రీ తదితరులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

అమలాపురం

వెంకటరామ	: అంబాజీపేట మ్యారేజీ బ్యాండు
వెంకటరమణ	: ఈగల్
శ్రీలలిత	: లాల్‌సలామ్
శేఖర్ స్క్రీన్-1	: హనుమాన్
శేఖర్ స్క్రీన్-2	: ట్రూ లవర్
రమా	: గుంటూరు కారం
గణపతి	: నాసామిరంగ
వెంకటపద్మావతిస్క్రీన్-1	: యాత్ర-2
వెంకటపద్మావతి స్క్రీన్-2	: గేమ్ ఆన్

పదో తరగతి విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ



రావులపాలెం, ఫిబ్రవరి 12: దేవరపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న 63మంది విద్యార్థులకు కొత్తపేట సబ్‌జైలు హెడ్‌వార్డర్ డి.రమేష్‌బాబుపరీక్షఅట్ట, స్కేలు, పెన్ అందజేశారు. వీటితో పబ్లిక్ పరీక్షలు బాగా రాసి మంచి మార్కులు సాధించాలని ఆయన ఆకాంక్షించారు.

పరిహారం ప్రభుత్వ ఖాతాకు జమచేయాలి

యానాం, ఫిబ్రవరి 12: యానాం మత్స్యకారుల ఇవ్వాల్సిన నష్టపరిహారాన్ని ప్రభుత్వ ఖాతాకు జమచేయాలని కాకినాడ ఓఎన్జీసీ ఈడి రత్నేష్‌కుమార్‌ను పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు కోరారు. ఈమేరకు ఆయనతో మల్లాడి సమావేశమయ్యారు. అనంతరం మీడియాతో మల్లాడి మాట్లాడారు. ఓఎన్జీసీసంస్థ తొలుత 15నెలలకు అంగీ కారం తెలపడంతో పుదుచ్చేరి ప్రభుత్వం 5,462మంది లబ్ధిదారుల జాబితాను ఇచ్చిందని, అయితే మొత్తం 15నెలలకు రూ.94కోటు కాగా ఇప్పటికే పుదుచ్చేరి ప్రభుత్వ ఖాతాలో రూ.23కోట్లు ఉన్న నేపథ్యంలో మిగిలిన రూ.71కోట్లను ఓఎన్జీసీ సంస్థ ప్రభుత్వ ఖాతాకు జమచేయాలని కోరామన్నారు. ఒక రోజు వ్యవధిలోనే ప్రభుత్వ ఖాతాకు ప్రభుత్వ ఖాతాలో నగదు జమచేస్తామని అధికారులు వెల్లడించారని మల్లాడి తెలిపారు. ఈపరిహారం మత్స్యకారులకు అందజేయడానికి ప్రభుత్వం జీవో విడుదల చేయాల్సి ఉండటంతో దీనికోసం పుదుచ్చేరి వెళ్తానని మల్లాడి తెలిపారు.

తెలుగు అధ్యాపకుల ఉభయ రాష్ట్రాల ఉపాధ్యక్షునిగా నల్లా

అమలాపురం టౌన్, ఫిబ్రవరి 12: ఉభయ తెలుగు రాష్ట్రాల తెలుగు అధ్యాపకుల సంఘ గౌరవ ఉపాధ్యక్షుడిగా అమలాపురానికి చెందిన ప్రముఖ సాహితీవేత్త నల్లానరసింహమూర్తిని నియమించారు. ఈమేరకు గౌరవాధ్యక్షుడు పత్తిపాటి రమేష్‌నాయుడు నియామక ఉత్తర్వులు సోమవారం అందజేశారు.

అభివృద్ధి పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే

కాట్రేనికోన, ఫిబ్రవరి 12: మండలంలో సోమవారం ఎమ్మెల్యే పొన్నాడ సతీష్‌కుమార్ పలుఅభివృద్ధి పనులను ప్రారంభించారు. పల్లంలో ఓఎన్జీసీ నిధులతో నిర్మించిన పీడబ్ల్యూఎస్ స్కీమ్, ఇంటింటికి కుళాయి పనులను ప్రారంభించారు. చిర్రయానాంలో ఓఎన్జీసీ నిధులతో నిర్మించిన వాటర్ ట్యాంకును, ఇంటింటికీ కుళాయి పనులను ప్రారంభించారు. కాట్రేనికోన శివారు నాగపట్నం, కాపులపాలెంలకు వాటర్ ట్యాంకు ప్రారంభించారు. ఎంపీపీ పాలెపు లక్ష్మీధర్మారావు, జడ్పీటీసీ నేల కిశోర్‌కుమార్, వైసీపీ అధ్యక్షుడు నల్లా నరసింహమూర్తి, ఆర్బీకే చైర్మన్ నాతి సత్యనారాయణ, జిల్లా వాణిజ్య విభాగం అధ్యక్షుడు సంసాని నాగేశ్వరరావు, వైస్ ఎంపీపీ సానబోయిన నాగేశ్వరరావు, సర్పంచ్‌లు గంటి వెంకటసుధాకర్, మల్లాడి బాబ్జి, ఓలేటి మంగాదేవినాగేశ్వరరావు, సొసైటీ చైర్మన్ యేడిద సుబ్బారావు, ఎంపీటీసీ కోలాటి సత్యం, యేడిద లక్ష్మణరావు పాల్గొన్నారు.

ర్యాపిడ్ యాక్షన్‌ఫోర్స్ కవాతు

మండపేట, ఫిబ్రవరి 12: త్వరలో జరిగే సాధారణ ఎన్నికలు నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం ఆదేశాలతో ర్యాపిడ్ యాక్షన్‌ఫోర్సు పోలీసులు, స్థానిక పోలీసులు సోమవారం మండపేటలో కవాతు నిర్వహించారు. స్థానిక పెద్దకాల్వ వంతెనవద్ద నుంచి కలవపువ్వు సెంటరు వరకుకవాతు సాగింది. ప్రజలుఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని, శాంతియుతంగా పోలింగ్‌కు ప్రజలు సహకరించాలని రామచంద్రపురం డీఎస్పీ రామకృష్ణ ప్రజ లకు పిలుపునిచ్చారు. కమాండర్ విజయకుమార్ వర్మ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో గొడవలు సృష్టిస్తే చర్యలు తప్పవన్నారు. మండపేట రూరల్ సీఐ శ్రీధర్‌కుమార్, పట్టణ పోలీసులు, బెటాలియన్ పోలీసులు పాల్గొన్నారు.

బండారు పరామర్శ

ముమ్మిడివరం, ఫిబ్రవరి 12: మాతృ వియోగంతో బాధపడుతున్న టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు తాడి నరసింహారావు, సోదరుడు జానకీరామ్, సోదరి అల్లాడి రమణీకుమారిలను కొత్తపేట మాజీ ఎమ్మెల్యేలు బండారు సత్యానందరావు, అయితాబత్తుల ఆనందరావు, గొలుగూరి వెంకటరెడ్డి, మోకా ఆనంద్ సాగర్‌లతో పాటు పలువురు సోమవారం పరామర్శించారు. దివంగత నేత తాడి తాతారావు సతీమణి పొన్నమ్మ ఇటీవల మృతిచెందిన విషయం విదితమే. ఆమె చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. నాయకులు పెన్మెత్స జగ్గప్పరాజు, పెన్మెత్స చిట్టిరాజు, పొత్తూరి విజయభాస్కరవర్మ, బండి గుప్తా, కాకర్లపూడి రాజేష్, దాట్ల రవివర్మ, దాట్ల బాబు, రంగ, పీటీవీ వర్మ, యాళ్ల ఉదయ్‌లతో పాటు పలువురు నివాళులర్పించారు. అలాగే ముమ్మిడివరంలోని శ్రీకృష్ణదేవరాయ మహిళా జూనియర్ కళాశాల, రావుబహదూర్ రఘుపతివెంకటరత్నంనాయుడు డిగ్రీ కళాశాలలో విద్యార్థినులు సంతాపం వ్యక్తం చేశారు. కళాశాలల విద్యార్థినులు, అధ్యాపకులు, యాజమాన్యం పొన్నమ్మ చిత్రపటానికి పూలమాలలువేసి శ్రద్ధాంజలి ఘటించారు. ప్రిన్సిపాల్ గంధం శ్రీరామమూర్తి, కరస్పాండెంట్ గణేశుల బ్రహ్మానందం, గణేశుల సతీష్, జగతా సురేష్, అధ్యాపకులు ఉన్నారు.

రాష్ట్ర స్థాయి కరాటే పోటీల్లో 'సిద్ధార్థ' విద్యార్థుల ప్రతిభ



ఆలమూరు, ఫిబ్రవరి 12: అమలాపురంలో జరిగిన రాష్ట్రస్థాయి కరాటే పోటీల్లో ఆలమూరు శ్రీసిద్ధార్థ హైస్కూలు విద్యార్థులు ప్రతిభ చాటారని కోచ్‌లు టి.అబ్బులు, వెంకటలక్ష్మి వివరించారు. వైట్ బెల్ట్-ఎ విభాగంలో గెద్దాడ జాయ్‌కిరణ్ (బంగారు), వైట్ బెల్ట్-బి విభాగంలో నాగవెంకటఅఖిల్ (రజత) పతకాలు సాధించారు. గరల్స్ విభాగంలో కట్టా అనుశ్రీకార్తీక్ (బంగారు), గ్రీన్‌బెల్ట్‌లో జి.వీరబాబు (బంగారు), సబ్‌జూనియర్ విభాగంలో గ్రీన్‌బెల్ట్‌లో బుంగ అశ్విన్ (బంగారు) పతకాలు గెలుచుకున్నారు. విజేతలను డైరెక్టర్ కె.ముల్లారావుతో పాటు పలువురు అభినందించారు.

అసరా చెక్కు పంపిణీ

పి.గన్నవరం, ఫిబ్రవరి12: పోతవరం ప్రధానరహదారి చెంతన ఏర్పాటు చేసిన బహిరంగసభలో వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్, జడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు 1515డ్వాక్రా గ్రూపులకు రూ.11.81కోట్ల ఆసరా చెక్కులను పంపిణీ చేశారు. ఎంపీడీవో త్రిశూలపాణి, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ నక్కా కృష్ణవేణి, సర్పంచ్‌లు తొలేటి బంగారునాయుడు, వడలి కొండయ్య, బీర వెంగమాంబ, బండి మహలక్ష్మి, నాయకులు అడ్డగళ్ల వెంకటసాయిరాం, నక్కా చినవెంకటేశ్వరరావు, మద్దుల వరలక్ష్మి, సాయి, కొక్కిరి రవికుమార్, పితాని నరసింహరావు, నాగాబత్తుల యువరాజు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల ధర్నా

రామచంద్రపురం, ఫిబ్రవరి 12: రామచంద్రపురం మున్సిపల్ వర్కర్స్ సోమవారం ధర్నా నిర్వహించారు. ఏఐటీయూసీ కార్యదర్శి పెద్దిరెడ్డి రాము మాట్లాడుతూ గత నెల సమ్మె విరమింపజేసి నప్పుడు ప్రభుత్వం ఇచ్చిన హామీలపై జీవో ఇవ్వని కారణంగా ధర్నా చేపట్టామన్నారు. అనంతరం కార్మికులు నినాదాలు చేశారు. ధర్నాలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి జి.రాజు, జిల్లా సమితి సభ్యులు ఎ.మాచరరావు, నాయ కులు, ఎన్.వి.వి.సత్యనారాయణ, వరారాజు, కార్మికులు పాల్గొన్నారు.

రెండు తాటాకిళ్లు దగ్ధం

పి.గన్నవరం, ఫిబ్రవరి 12: పోతవరంలో ఆదివారం అర్ధరాత్రి పెద్దిమేను మంగాయమ్మకు చెందిన తాటాకిల్లు విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో దగ్ధం కాగా ప్రక్కనే ఉన్న పెద్దిమేను శ్రీనివాసరావు ఇల్లు కూడా అగ్నికి ఆహుతైంది. రెండు కుటుంబాలకు చెందిన గృహోపకరణాలు, వంటసామగ్రి, బంగారం, రూ.లక్ష నగదు కాలిపోయాయి. బాధిత కుటుంబాలు రోదిస్తున్నారు. రూ.లక్ష విలువైన హెచ్‌డీపీఈ హీటింగ్ మిషన్ కాలిపోయింది. రెవెన్యూ సిబ్బంది వివరాలు సేకరించి, తక్షణ సాయంగా పది కిలోలు చొప్పున బియ్యం అందించారు.

అగ్నిప్రమాద కుటుంబాలను తక్షణమే ఆదుకోవాలి

అగ్నిప్రమాద బాధిత కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జ్ గిడ్డి సత్యనారాయణ కోరారు. రెండు కుటుంబాలకు రూ.20వేలు, 25కిలోల చొప్పున బియ్యం అందించారు. పరామర్శించిన వారిలో ఎంపీపీ గనిశెట్టి నాగలక్ష్మి, సాధనాల శ్రీవెంకటసత్యనారాయణ, షేక్ సుభాని, యల్లమిల్లి చిట్టిబాబు, యర్రంశెట్టి తాతకాపు, తాటికాయల శ్రీనివాసరావు, తెలగారెడ్డి వెంకటకృష్ణ, తాటికాయల వెంకటేష్, కత్తుల శ్రీనివాస్, కోట రాజేంద్ర, నెరెడిమిల్లి రఘు, బొడపాటి తాతాజీ, ఈతకోట వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

విద్యార్థులు ఇష్టపడి చదివి ఉన్నత స్థాయికి ఎదగాలి

అల్లవరం, ఫిబ్రవరి 12: విద్యార్థులు ఇష్టపడిచదివి ఉన్నత స్థాయికి చేరుకుని తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చాలని రాష్ట్ర పెట్టుబడులు, మౌలిక సదుపాయాలశాఖ ప్రత్యేకకార్యదర్శి తాళ్ల సత్యనారాయణమూర్తి అన్నారు. సోమవారం ఆయన గోడి గురుకుల పాఠశాలలో విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. తాళ్ల సరస్వతమ్మ-ముత్యాలు చారిటబుల్ ట్రస్టు తరఫున పదో తరగతి పరీక్షలు రాయబోయే 128మంది విద్యార్థులకు పరీక్షా సామగ్రి అందించారు. జల్లి శ్రీనివాసరావు, నాతి శ్రీనివాసరావు, తాళ్ల సాంబమూర్తి, శ్రీను, గోసంగి సత్యనారాయణమూర్తి, ప్రిన్సిపాల్ ఎన్.శ్రీనివాస్, బళ్ల కమలతేజ, విప్పర్తి భాను పాల్గొన్నారు.

సహకార సంఘం పాలకవర్గ ప్రమాణ స్వీకారం

ఆలమూరు, ఫిబ్రవరి 12: మోదుకూరు ప్రాథమికవ్యవసాయ పరపతి సంఘం పాలకవర్గ ప్రమాణస్వీకారం సోమవారంజరిగింది. అధ్యక్షుడిగా ముత్యాల పుల్లారావు, సభ్యులుగా తాతపూడి రాంబాబు, ఎస్.సత్యనారాయణ బాధ్యతలు స్వీకరించారు. వారిని రైతులు, నాయకులు అభినందించారు.

16న బంద్‌ను విజయవంతం చేయాలి

అమలాపురం టౌన్, ఫిబ్రవరి 12: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న రైతు, కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈనెల16న చేపట్టిన దేశవ్యాప్త బంద్‌ను విజయవంతం చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు డేగ ప్రభాకర్ పిలుపునిచ్చారు. అమలాపురం ప్రెస్‌క్లబ్‌లో జి.రవికుమార్ అధ్యక్షతన సీపీఐ జిల్లా కార్యవర్గ సమావేశం సోమవారం జరిగింది. జిల్లా కార్యదర్శి కె.సత్తిబాబు, కన్వీనర్ శామ్యూల్, కార్యవర్గ సభ్యులు పెద్దిరెడ్డి రాము, కె.రామకృష్ణ, దేవ రాజేంద్రప్రసాద్, వీఎస్ రాజు, వి.వెంకట్, మోకా శ్రీనివాసరావు, కుంపట్ల వరుణ్‌బాబు, జి.రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

కరాటేలో 'బేతని' ప్రతిభ

కాట్రేనికోన, ఫిబ్రవరి 12:అమలాపురంలో ఆదివారం జరిగిన నాల్గవ స్టేట్ కరాటే పోటీల్లో ఉప్పూడిబేతని ఇంగ్లీష్ మీడియం స్కూలువిద్యార్థినీ విద్యార్థులు ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించారు. ప్రిన్సిపాల్ ఎలిజబెత్‌రాణి, లోకల్‌మేనేజర్ డేసిమణి, సిస్టర్ అరుణ, సర్వేశ్వరరావు, రమేష్, లక్ష్మీ, మోహన్‌అభినందించారు. కరాటే మాస్టర్ రారాజుకు శుభాకాంక్షలుతెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

మామిడికుదురు, ఫిబ్రవరి 12: జాతీయ రహదారి విస్తరణలో భాగంగా చెట్లు తొలగించేందుకు పాశర్లపూడి బాడవ, పెదపట్నంలంక, బి.దొడ్డవరం గ్రామాల్లో మంగళవారం ఉదయం 10నుంచి సాయంత్రం 4గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ ఎం.రవికుమార్ తెలిపారు.